FOR ADS.......
ఆకాంక్ష
CONTACT :
8333818121

# తొలి ఆకాంక్ష

TGTEL/25/A1964
తెలుగు సంచలన దిన పత్రిక

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో
భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్, సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
ఆకాంక్ష
akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :155 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ ఆదివారం- 25 - జనవరి - 2026

## 20 వేల మంది విద్యార్థులతో 'వందేమాతరం' - ప్రత్యేక ఆకర్షణగా భారీ త్రివర్ణ పతాకం



విశాఖకు చెందిన యునైటెడ్ స్టూడెంట్స్ నెట్ వర్క్ సంస్థ ఆధ్వర్యంలో 25 వేల చదరపు అడుగుల త్రివర్ణ పతాక ప్రదర్శన

వందేమాతరం గేయం రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో వేడుకలు

స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని నన్నయ విశ్వవిద్యాలయంలో భారీ వేడుకలు నిర్వహించారు. దాదాపు 20 వేల మందికి పైగా విద్యార్థులతో వందేమాతరం గీతాలాపన చేశారు. నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రసన్నశ్రీ ఆధ్వర్యంలో అనుబంధ కళాశాలల నుంచి కూడా అనేక మంది విద్యార్థులు తరలివచ్చారు. వచ్చిన విద్యార్థులు కూడా సామూహిక వందేమాతరం గేయం ఆరాధనలో పాల్గొన్నారు. విశాఖకు చెందిన యునైటెడ్ స్టూడెంట్స్ నెట్ వర్క్ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 25 వేల చదరపు అడుగుల త్రివర్ణ పతాకాన్ని మిగతా..2లో

## నాంపల్లిలోని ఫర్నిచర్ దుకాణంలో అగ్నిప్రమాదం



4 ఫైరింజన్లతో మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది, భవనంలో ఇద్దరు పిల్లలు, తల్లి చిక్కుకున్నట్లు స్థానికుల వెల్లడి

హైదరాబాద్ నాంపల్లిలోని ఓ ఫర్నిచర్ గోడౌన్ లో భారీగా మంటలు ఎగిసిపడుతున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, హైడ్రా, విపత్తు నిర్వహణ బృందం సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది 4 ఫైర్ ఇంజిన్ వాహనాలు, స్కైలిఫ్ట్ క్రేన్ సహాయంతో మంటలు ఆర్పుతున్నారు. కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్ : నాంపల్లిలోని బచ్చా క్రిస్టల్ ఫర్నిచర్ గోడౌన్ లో మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. నాలుగంతస్తులున్న ఈ భవనంలోని అన్ని ఫ్లోర్లకు మంటలు వ్యాపించాయి. అగ్ని ప్రమాదంలో మొత్తం 6 మంది ప్రమాదంలో చిక్కుకోగా అందులో వాచ్ మెన్ కుటుంబంలోని ఇద్దరు పిల్లలు, మరో కుటుంబంలోని నలుగురు పెద్దవారు ఉన్నారు. పిల్లల తల్లిదండ్రులు లక్ష్మి, యాదమ పని నిమిత్తం బయటకు వెళ్లారు. మిగతా..2లో

## నైనీ టెండర్ రద్దు చేశారంటే స్కాం జరిగినట్టే కదా



★ తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

★ నైనీ టెండర్ రద్దు చేశారంటే.. స్కాం జరిగినట్టే కదా అని ప్రశ్నించారు.

హైదరాబాద్, జనవరి24 : తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. నైనీ టెండర్ రద్దు చేశారంటే.. స్కాం

## నేతగా కాదు వ్యూహకర్తగా కవిత:
## మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ ప్రయోగం...

● ఉమ్మడి కరీంనగర్ నుంచే ప్రభావం..? సింహం గుర్తుతో మళ్లీ రాజకీయ చర్చ

● మున్సిపల్ ఎన్నికలే లక్ష్యం...ఫార్వర్డ్ బ్లాక్ బీఫాంలపై కవిత పట్టు...

● సింహం గుర్తు చుట్టూ కవిత వ్యూహం..

● మున్సిపల్ ఎన్నికల్లో కొత్త రాజకీయ సమీకరణలు...



మిగతాది 2లో

తెలంగాణబ్యూరో/ జనవరి 24 (ఆకాంక్ష): తెలంగాణ రాజకీయాలు మరోసారి కీలక మలుపు తిరుగుతున్నాయి. జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాజకీయ వ్యూహాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు కేంద్ర బిందువుగా మారాయి. రాబోయే మున్సిపల్ ఎన్నికలను



లక్ష్యంగా చేసుకుని సింహం గుర్తు చుట్టూ కొత్త రాజకీయ సమీకరణాలను ఆమె రూపొందిస్తున్నట్టు రాజకీయ వర్గాల్లో బలమైన సంకేతాలు వినిపిస్తున్నాయి. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో కుదిరిన తాజా అవగాహన ఒప్పందం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఉత్కంఠను రేపుతోంది. హైదరాబాద్‌లో శుక్రవారం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు సహా ముఖ్య నేతలతో కల్వకుంట్ల కవిత నిర్వహించిన భేటీ రాజకీయంగా అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయి



● కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ షాకింగ్ కామెంట్స్ చేశారు.

● గతంలో కేసీఆర్ కుటుంబమే సింగరేణిని దోచుకుందని ఆరోపించారు.

హైదరాబాద్, జనవరి24 : కాంగ్రెస్ , బీఆర్ఎస్ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ షాకింగ్ కామెంట్స్ చేశారు. మిగతా..2లో

## ఎక్కడ ఉంటే అక్కడ ఓట్ల చోరీ.. గుజరాత్‌లో ఓట్ల తొలగింపుపై రాహుల్ తీవ్ర ఆరోపణలు



● కేంద్ర ప్రభుత్వం, బీజేపీ లక్ష్యంగా లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

● ఎక్కడ ఉంటే అక్కడ ఓట్ల చోరీ.. గుజరాత్‌లో ఓట్ల తొలగింపుపై రాహుల్ తీవ్ర ఆరోపణలు

ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం, బీజేపీ లక్ష్యంగా లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మిగతా..2లో

## గిరిజనుల గొంతు నొక్కుతున్నారు'
## నికోబార్ ప్రాజెక్టుపై కాంగ్రెస్ స్పందన

❖ కోర్టుల్లో కేసులు ఉన్నా ఆగని పనులు- గిరిజనులను బెదిరిస్తున్న అధికారులు

❖ పూర్వీకుల భూములు లాక్కునే కుట్ర- సోనియా గాంధీ హెచ్చరికలు బేఖాతర్

❖ రాజ్యాంగ చరిత్రను గుర్తు చేసుకున్న కాంగ్రెస్



ఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం పర్యావరణానికి పెను ముప్పుగా మారే 'గ్రేట్ నికోబార్ ప్రాజెక్టు'ను మొండిగా ముందుకు తీసుకెళ్తోందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఆయన ఈ అంశంపై కేంద్రం తీరును ఎండగట్టారు. నికోబార్ దీవుల్లోని ఆదివాసీ గిరిజనుల హక్కులను కాలరాస్తున్నారని, వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కోర్టుల్లో కేసులు నడుస్తున్నా, పర్యావరణవేత్తలు గగ్గోలు పెడుతున్నా, మోదీ ప్రభుత్వానికి మాత్రం చీమ కుట్టినట్లయినా లేదన్నారు. వారి ఉదాసీన వైఖరి దేశానికి ప్రమాదకరమని ఆయన మండిపడ్డారు. ఇదే సమయంలో భారత రాజ్యాంగంపై సంతకాలు చేసి నేటికి 76 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని కూడా జైరాం రమేశ్ గుర్తు చేసుకున్నారు. మిగతా..2లో

## విదేశాలతో కుదుర్చుకునే ఒప్పందాలు దేశ యువతకు కొత్త అవకాశాలు

❖ రోజ్‌గార్ మేళాలో జాబ్స్ పొందిన 61వేల మందికి ప్రధాని పిలుపు

❖ అపాయింట్‌మెంట్ లెటర్లు పంపిణీ చేసిన మోదీ

❖ దేశ రక్షణ, ఆరోగ్య, విద్యా, ఇంధన రంగాలను బలోపేతం చేయాలని వెల్లడి



వివరాలు 2లో..

ఢిల్లీ : ప్రపంచ దేశాలతో భారత్ కుదుర్చుకుంటున్న వాణిజ్య, వలస విధానాల ఒప్పందాలు కూడా దేశ యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. నూతన అవకాశాలు భారత గడ్డపైన, విదేశాల్లోనూ ఏర్పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో యువత భారత్‌లో ఉన్నారని, వారికి ఉపాధి అవకాశాలను కల్పించే అంశానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వెల్లడించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన 18వ రోజ్‌గార్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన 61వేల మందికిపైగా యువతకు అపాయింట్‌మెంట్ లెటర్లను అందజేసే కార్యక్రమాన్ని శనివారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈసందర్భంగా యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

**ఎఫ్‌డీఐలు ఎంతగా పెరిగితే,**

**అంతగా ఉద్యోగ అవకాశాలు**

## కిటకిటలాడుతున్న తిరుమల.. సర్వదర్శనానికి 24 గంటలు



★ శ్రీవారి దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు

★ భక్తులతో నిండిపోయిన అన్ని కంపార్టుమెంట్లు

★ నిన్న స్వామిని దర్శించుకున్న 69,726 మంది భక్తులు

అమరావతి : కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి కొలువుదీరిన పుణ్యక్షేత్రం తిరుమల భక్తులతో కిటకిటలాడుతోంది.

## 'పోరు వద్దు ఊరు ముద్దు'...

▶▶ రామగుండం పోలీసుల ఎదుట 8మంది మావోయిస్టుల లొంగుబాటు...

▶▶ తెలంగాణ పునరావాస పథకాలపై నమ్మకం...జనజీవన స్రవంతిలోకి అడుగు

గోదావరిఖని/జనవరి 24(ఆకాంక్ష) : నిషేధిత సీపీఐ (మావోయిస్టు) పార్టీకి చెందిన మిలీషియా, కోరియర్, సాంస్కృతిక విభాగం, లోకల్ కమిటీకి చెందిన ఎనిమిది మంది సభ్యులు శనివారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో కమీషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిశోర్ ఝా ఐపీఎస్ ఎదుట లొంగిపోయారు. తెలంగాణ ప్రభుత్వం



మిగతాది 2లో

మరియు పోలీస్ శాఖ ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, లొంగిపోయిన మావోయిస్టుల పట్ల ప్రభుత్వం చూపుతున్న ఆదరణ, పునరావాస



పథకాలపై నమ్మకంతో తాము కుటుంబాలతో కలిసి ప్రశాంత జీవితం గడపాలనే నిర్ణయానికి వచ్చి లొంగుబాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా మరియు తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో క్రియాశీలకంగా పనిచేసిన ఈ ఎనిమిది మంది మావోయిస్టులు గతంలో మిలీషియా కమాండర్‌గా, కోరియర్‌గా, సాంస్కృతిక ప్రచారకర్తలుగా, స్థానిక కమిటీ సభ్యులుగా పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. వీరిలో ఒకరు తెలంగాణకు చెందినవారిగా గుర్తించగా, మిగిలిన ఏడుగురు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గాంగేలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గంపుర్ గ్రామానికి చెందినవారిగా వెల్లడించారు. మావోయిస్టు పార్టీ అజ్ఞాత జీవితం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు, కుటుంబాల నుంచి దూరమవడం, నిరంతర భద్రతా ఒత్తిళ్లు వంటి కారణాలతో సాధారణ జీవనంలోకి

## విశాఖ ఉక్కుపై కేంద్రం ప్రత్యేక దృష్టి
## కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



2లో

● విశాఖ ఉక్కుపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వ్యాఖ్యానించారు.

● కేంద్రం పాలసీకి విరుద్ధంగా రాష్ట్ర ప్రజలు సెంటిమెంట్, రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి మేరకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చారని పేర్కొన్నారు.

# సంపాదకీయం

## పనగారియా సలహాలను పాలకులు పాటిస్తారా

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆత్మీయంగా అభిమానించే ఆర్థికవేత్త ప్రొఫెసర్ అరవింద్ పనగారియా. ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో ఇరువురి మధ్య భావ సమైక్యత ఉన్నది. ప్రొఫెసర్ పనగారియా నీతి ఆయోగ్‌కు మొదటి చైర్మన్ (జనవరి 2015ఆగస్టు 2017). భారత్ తరఫున జీ20 షెర్పా (201517)గా కూడా ఆయన వ్యవహరించారు. ఏప్రిల్ 2023లో నలందా విశ్వవిద్యాలయం ఛాన్సలర్‌గా ఆయన నియమితులయ్యారు. డిసెంబర్ 2023లో 16వ ఆర్థిక సంఘం చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం నియమించిన అనేక టాస్క్‌ఫోర్స్‌లకు పనగారియా నేతృత్వం వహించారు. ఎన్డీఏ ప్రభుత్వంలో పనగారియా సుదీర్ఘకాలం వివిధ పదవులు నిర్వహించడం విశేష ప్రాధాన్యమున్న విషయం. డాక్టర్ పనగారియా కొలంబియా విశ్వవిద్యాలయంలో శాశ్వత ఆచార్యుడు. తన మెంటార్ డాక్టర్ జగదీశ్ భగవతి వలే పనగారియా కూడా స్వేచ్ఛా వాణిజ్యవాది. స్వేచ్ఛా వాణిజ్యం, మూలధన ప్రవాహాలను అనుమతించే బహిరంగ ఆర్థిక వ్యవస్థలను ఎటువంటి మినహాయింపులు లేకుండా ఇరువురూ సమర్థిస్తారు. ఇందుకు వారిపట్ల నాకు ఎంతో గౌరవ భావమున్నది. డాక్టర్ పనగారియా ఇటీవల ఒక వ్యాసంలో ప్రభుత్వాన్ని ఇలా అభినందించారు: '2025వ సంవత్సరం చరిత్రలో ఆర్థిక సంస్కరణల సంవత్సరంగా నిలిచిపోతుంది'. అది నిజం కాదని పనగారియాకు బాగా తెలుసు. 2025లో చాలా స్వల్ప సంస్కరణలు మాత్రమే జరిగాయి. మీడియా కథనాలు, పార్లమెంటరీ చర్చలను పరిశీలిస్తే 2025 సంవత్సరంలో 'ఆర్థిక సంస్కరణలు'గా చెప్పదగినవి ఏవీ అమలు కాలేదని స్పష్టమవుతుంది. వస్తుసేవల పన్ను రేట్ల సరళీకరణ, తగ్గింపు జూలై 2017లో చేసిన అసలు పాపానికి ప్రాయశ్చితం చేసుకోవడమే; కస్టమ్స్ సుంకాల హేతుబద్ధీకరణ కూడా దేశీయ పరిశ్రమల సంరక్షణ చర్యల కింద ఆ సుంకాలను పెద్ద ఎత్తున పెంచడం, అలాగే యాంటీడంపింగ్, భద్రతా సుంకాలను పెంచుతూ తీసుకున్న నిర్ణయాలను సరిదిద్దుకోవడమే; కార్మిక చట్టాలను పటిష్ఠపరచడం ఇప్పటికే బాగా ప్రయోజనం పొందుతున్న పెట్టుబడిదారులకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయమే. నోరు తిరగని పేరు (వీబీజీరామ్‌జీ) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో ప్రవేశపెట్టిన కొత్త ఉపాధి చట్టం ప్రపంచ అతిపెద్ద ఉపాధిసంక్షేమ పథకాన్ని కూల్చివేసింది. ప్రొఫెసర్ పనగారియా మీద పరిపూర్ణ గౌరవంతోనే గణనీయమైన ఆర్థిక సంస్కరణల సంవత్సరంగా 2025 చరిత్ర కెక్కదని నేను గట్టిగా భావిస్తున్నాను. నిజానికి 2026లో ప్రభుత్వం విధిగా ఆరు చర్యలు చేపట్టాలని పనగారియా సిఫారసు చేశారు. అవి, ఆర్థిక సంస్కరణలను ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రభుత్వానికి ఆయన ఇచ్చిన సలహాలు అనడంలో సందేహం లేదు. ఆ ఆరు సిఫారసులు ఏమిటో చూద్దాం: కస్టమ్స్ సుంకాలను వెనక్కి తీసుకోవడం. దిగుమతి సుంకాలను తగ్గించడం లేదా తొలగించాలని పనగారియా నిష్కర్షగా చెప్పారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే దిగుమతులకు వర్తించే సగటు టారిఫ్ రేటును తగ్గించి తీరాలి. ప్రతి సుంకాన్ని నిర్దిష్ట శ్రేణి సరుకుల వాస్తవ పరిమాణం లేదా వాటి వాస్తవ వాణిజ్య విలువ ప్రాతిపదికన లెక్కించాలి. ఈ మేరకు అన్ని సరుకులపై సుంకాన్ని 6.34శాతానికి యూపీఏ ప్రభుత్వమే తగ్గించింది. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ఈ సగటు దిగుమతి సుంకం దాదాపు 12 శాతానికి పెరిగింది. అన్ని రకాల దిగుమతులపై ఏకరీతిగా 7శాతం సుంకాన్ని విధించాలని పనగారియా సిఫారసు చేశారు. నాణ్యత నియంత్రణ ఉత్తర్వుల (క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్స్ క్యూసీఓ) ఉపసంహరణ పూర్తి చేయాలి అన్నది రెండో సిఫారసు. ఇవి దిగుమతులకు సుంకాలేతర అవరోధాలు. అవే నాణ్యతా ప్రమాణాలను భారతీయ ఉత్పత్తులకు కూడా వర్తింపజేస్తే మన ఉత్పత్తులు ఎన్ని నిలుస్తాయి? 2025లో 22 క్యూసీఓలను ఉపసంహరించినందుకు ప్రభుత్వాన్ని పనగారియా అభినందించారు. అయితే ఈ 22 క్యూసీఓలను మొదట ఉపసంహరించింది ఎవరు?; వాణిజ్య ఒప్పందాల గురించి ప్రస్తావిస్తూ 'దిగుమతుల సరళీకరణను మనం స్వతస్సిద్ధంగా ప్రతిఘటిస్తున్నామని' పనగారియా వ్యాఖ్యానించారు. 'మనం' అంటే ఎవరు? ఎన్డీఏ ప్రభుత్వమే కాదూ? రెండు దశాబ్దాల దిగుమతి సరళీకరణ విధానాన్ని వ్యతిరేకించింది. విదేశీ వాణిజ్య విధానాన్ని కఠినం చేసింది. 2018లో సీపీటీపీపీపై సంతకం చేసేందుకు అందిన ఆహ్వానాన్ని ఆమోదించలేదు. 2019లో ఆర్‌సీఈపీ నుంచి ఉపసంహరించుకున్నది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల పట్ల విముఖత చూపింది; డీజీటీఆర్ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమెడీస్)ను సంయమనపరచాలని పనగారియా సిఫారసు చేశారు. ప్రపంచ సరుకుల వాణిజ్యంలో భారత్ వాటా కేవలం 2.8 శాతం మాత్రమే. అయినా వివిధ సరుకులపై మన దేశం 250 యాంటీ డంపింగ్ సుంకాలు విధించింది. రూపాయి విలువను అధికం చేయవద్దని పనగారియా సిఫారసు చేశారు. మారకం రేటు చాలా సున్నితమైన అంశం. విదేశీ మారక ద్రవ్యం ప్రవాహం, ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు మొదలైన విషయాలతో అది ప్రభావితమవుతుంది. అధిక విలువ రూపాయి ఎగుమతులను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. కనుక రూపాయి విలువ విషయాన్ని మార్కెట్‌కు వదిలివేయడం మంచిది; ఎగుమతుల పర్యవేక్షణకు విధానపరమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. సవాలక్ష నిబంధనలు, ఆదేశాలు, వాణిజ్య మంత్రిత్వ శాఖకు దరఖాస్తుల వ్యవహారం, అనుమతులు సాధించడం మొదలైనవి ఎగుమతులకు ప్రతిబంధకమవుతున్నాయి. 16వ ఆర్థిక సంఘం చైర్మన్‌గా అరవింద్ పనగారియా విధాన వైఖరి 202627 కేంద్ర బడ్జెట్‌కు కీలకమైనది. రాబోయే కొత్త బడ్జెట్ నుంచి మనం ఏమి ఆశించవచ్చో పనగారియా వ్యాసం సూచిస్తోంది. అలాగే ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం నిర్వహిస్తోన్న తీరు

# మనసు... తెలుసుకుంటున్నారా



బాలికల చదువు, నైపుణ్యాల పెంపు, సాధికారత లాంటి అంశాలకు సంబంధించి మాట్లాడటం, రకరకాల పథకాలను ప్రవేశపెట్టడం పెరుగుతోంది. కానీ ఎంతో ముఖ్యమైన వారి మానసికారోగ్యం మాత్రం ఈ ప్రాధాన్యాల్లోకి రావడం లేదన్నది చేదు వాస్తవం. నేడు జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా... ఇలాంటివన్నీ చదివి పేజీ తిప్పేసే వార్తలుగానే మనం చూస్తున్నట్లయితే రేపటి సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నట్లే. ఎందుకంటే అవి శిక్షార్హమైన నేరాలు మాత్రమే కావు, పిల్లల కళ్లెదురుగా జరుగుతున్న ఘోర వాస్తవాలు. ఎందరికో అనుభవంలోకి వచ్చేవీ, వారి రేపటి జీవితాన్ని ప్రభావితం చేసేవీ. వాటిని పెద్దలు తీసుకున్నంత తేలికగా పిల్లలు తీసుకోలేరు. ముఖ్యంగా కౌమారంలో ఉన్న బాలికలది చాలా సున్నితమైన పరిస్థితి. అసలే హార్మోన్ల మార్పులకు లోనయ్యే వయసు... దానికి తోడు చదువుల ఒత్తిడి. అవి చాలవన్నట్లు కుటుంబాలూ, సమాజంలోని సకల అవలక్షణాల ప్రభావమూ వారిమీద పడుతోంది. జరుగుతున్న సంఘటనల తాలూకు అంతరార్థాలు, ఆ పరిస్థితుల వెనక ఉన్న కారణాలూ తెలిసీ తెలియని వయసులో ఉన్న ఆ చిన్ని మనసుల్ని అయోమయంలో పడేస్తున్నాయి. వారి ఆలోచనలు స్వేచ్ఛాయుత వాతావరణంలో చర్చలుగా మారి సమాధానాలు దొరికితే, చక్కటి మార్గదర్శకత్వం అందితే పర్వాలేదు. క్రమంగా మానసిక పరిణతి వస్తుంది. కానీ అలాంటి వాతావరణం లేకపోతే అవే తీరని సమస్యలుగా గుండెల్లో గూడు కట్టుకుని మానసిక రోగాలై జీవితకాలం వేధిస్తాయంటున్నారు నిపుణులు. పెద్దల్లో పెరుగుతున్న మానసిక వ్యాధులపై జరిగిన అధ్యయనాలు ఆ సమస్యల్లో చాలా వాటికి మూలం వారి బాల్యంలోనే ఉందని రుజువుచేశాయి. పెరిగిన వాతావరణం, అనుభవాలు, చైల్డ్‌హుడ్ ట్రామా లాంటివన్నీ మనసులో పేరుకుపోయి వివిధ రకాల మానసిక ఆరోగ్య సమస్యలుగా బయటపడతాయని చెబుతున్నాయి.

### ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాలు

దేశంలో కౌమార(10-19 ఏళ్ల మధ్య వయసు) బాలికల్లో 58.9శాతం మంది యాంగ్జయిటీ, డిప్రెషన్ లాంటి సమస్యలతో బాధపడుతున్నట్లు అధ్యయనాలు చెబున్నాయి. 'అడాలసెంట్ గర్ల్స్ మెంటల్ హెల్త్ ఇన్ ఇండియా: ప్రివలెన్స్ అండ్ డిస్ట్రెస్' అనే అధ్యయనం ప్రకారం 49 నుంచి 60శాతం వరకూ కౌమార బాలికలు కుంగుబాటు, యాంగ్జయిటీ లక్షణాలతో సతమతమవుతున్నారు. మగపిల్లలతో పోలిస్తే ఆడపిల్లల్లో ఒత్తిడి తాలూకు మానసిక రుగ్మతలు ఎక్కువగా ఉంటున్నట్లు మరొక జాతీయ సర్వే వెల్లడించింది. వీటికి సరైన సమయంలో చికిత్స అందించకపోతే స్వీయహాని, ఆత్మహత్యలకు దారితీయవచ్చు. కౌమార వయస్కుల మరణాల్లో మూడొంతులు ఆత్మహత్యలేనన్నది గమనార్హం. ఏదో చదువుల తాలూకు టెన్షన్ తప్ప పిల్లలకేం సమస్యలుంటాయి... అనుకునే తల్లిదండ్రులు వారి మనసుల్లో ఏముందో తెలుసుకోలేకపోతున్నారు. అందుకే బాధితుల్లో వృత్తినిపుణుల సహాయ సహకారాలు అందుకుంటున్నది అతి కొద్దిమంది మాత్రమే. అసలింతకీ అమ్మాయిల్ని ఇంత ఒత్తిడికి గురిచేస్తున్న సమస్యలేంటీ అంటే- 87శాతం చదువు, 46 శాతం కుటుంబ ఆర్థిక సమస్యలు, 51 శాతం కుటుంబ గొడవలు అని లెక్కలు చెబుతున్నాయి. వీటిని విడమరిస్తే- చదువు అంటే కేవలం మార్కులు తెచ్చుకోలేకపోవడం కాదు, అందులో ఉండే పోటీ, రకరకాల వివక్షలు, బడికీ కాలేజీకీ వెళ్లొచ్చే క్రమంలో ఎదుర్కొనే వేధింపులు లాంటివన్నీ ఉంటాయి. ప్రత్యక్షంగా వాళ్ల అనుభవంలోకి వస్తేనే సమస్యలు అనుకోకూడదు. స్కూల్లో ఒక్క విద్యార్థిని బాల్యవివాహంతో చదువు మానేసినా, ఎక్కడో ఒక లైంగిక వేధింపుల కేసు వెలుగులోకి వచ్చినా కొన్నాళ్లపాటు పిల్లల్లో అది చర్చనీయాంశమవుతుంది. వాళ్లలో వాళ్లు మాట్లాడుకుంటారు తప్పితే దాని గురించి పెద్దవాళ్ల ముందు ప్రస్తావించరు. అది తమకే జరిగితే ఎలా అని కొందరు భయపడటమూ కద్దు. వీటన్నిటికీ తోడు కుటుంబం పిల్లలమీద పెట్టుకుంటున్న అత్యాశలు, పేదరికం, అమ్మానాన్నల మధ్య గొడవలు, వ్యసనాలు, గృహహింస, లైంగిక వేధింపులు... వీటన్నిటికీ ప్రత్యక్ష బాధితులు వాళ్లే. ఇవన్నీ పిల్లల చదువుమీద ప్రభావం చూపుతాయి. ఉత్సాహం మీద నీళ్లు చల్లుతాయి. మందకొడిగా ఉండటం, దేనిమీదా ఆసక్తి చూపకపోవడం, ఒంటరితనాన్ని ఇష్టపడటం, తరచూ అనారోగ్యానికి గురికావడం, ఉన్నట్లుండి చదువులో వెనకబడటం లాంటి లక్షణాలు పిల్లల్లో కనబడతాయి. దీర్ఘకాలం ఈ పరిస్థితి కొనసాగితే అదే కుంగుబాటుకు దారితీస్తుంది.

అప్రమత్తత అవసరం

పాతికేళ్లొచ్చినా కన్నబిడ్డల్ని 'పిల్లలు'గానే పరిగణించే సమాజం మనది. కానీ నిజానికి బాల్యం, కౌమారం, యవ్వనం... ప్రతి దశా ఎదుగుదలకు సంబంధించి ఒక్కో కీలకమైన ఘట్టం. ఏ వయసులో ఏది అవసరమో అదే ఇవ్వాలి. పసిపిల్లలకు కడుపునిండా పాలు, వెచ్చని అమ్మఒడి చాలు. తప్పటడుగులు వేసే చిన్నారిని చేయి పట్టుకుని నడిపించాలి, చూస్తానన్నవన్నీ చూపించాలి, మంచీ చెడూ విడమరిచి చెబుతూ ఉండాలి. బడికెళ్లే పిల్లలకు చిన్న చిన్నగా బాధ్యతలను అలవాటు చేయాలి, నైపుణ్యాలు నేర్పాలి. వ్యక్తిత్వం రూపుదిద్దుకునే కౌమారం చాలా కీలకమైన దశ. నూరేళ్ల వ్యక్తిగత, సామాజిక జీవితానికి పునాది పడేది అప్పుడే. ఇంట్లోనూ బయటా వారిని ప్రభావితం చేసే అంశాలూ ఎక్కువే. ఆ వయసులో మార్గదర్శకత్వంతో కూడిన స్వేచ్ఛనివ్వడం తప్పనిసరి. తల్లిదండ్రులు స్నేహితులుగా మారి అన్ని విషయాలూ చర్చించాలి. వాళ్లు ఏం చేస్తున్నారు, ఏం చూస్తున్నారు, ఏం ఆలోచిస్తున్నారు... అన్నీ గమనిస్తూ ఉండాలి. వారికి కావాల్సినవన్నీ అమరుస్తున్నాం అనుకుంటే సరిపోదు. తాము పిల్లలమీద పెట్టుకున్న ఆశల గురించి చెప్పడం కాదు, తమనుంచి పిల్లలు ఏం ఆశిస్తున్నారో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు టీనేజీ పిల్లల పాలిట పెద్ద విపత్తుగా పరిణమించాయి. పలు విషయాల్లో ఇతరులతో పోల్చుకోవడం ఎక్కువవుతోంది. ఆన్‌లైన్ స్నేహాలూ ప్రేమలను నమ్మి మోసపోతున్న సంఘటనలు, సైబర్ బుల్లీయింగ్ బాధితులవుతున్న కేసులు పెరుగుతున్నాయి. వీటన్నిటినుంచి అమ్మాయిల్ని రక్షించుకోవాలంటే తల్లిదండ్రులూ ఉపాధ్యాయులూ అప్రమత్తంగా ఉండాలి. 'ఆమె చిన్నదే కావచ్చు కానీ, అపారమైన శక్తి ఆమెలో నిక్షిప్తమై ఉంది' అన్నారు షేక్‌స్పియర్. ఆ శక్తి కుటుంబానికీ సమాజానికీ ఉపయోగపడేలా మలచుకోవాల్సిన బాధ్యత పెద్దలదే!

# విద్యాసంస్థలను వీడని బంధనాలు



దేశంలోని ఉన్నత విద్యాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలని, తద్వారా ఆయా సంస్థలు నూతన ఆవిష్కరణలు చేయడంలో రాణించగలవని జాతీయ విద్యా విధానం ఉద్ఘాటిస్తోంది. అయినప్పటికీ అనేక విశ్వవిద్యాలయాలు కేంద్రీకృత పరిపాలనా విధానాన్నే అనుసరిస్తున్నాయి. ఫలితంగా నిర్దేశిత లక్ష్యాన్ని అందుకోలేకపోతున్నాయి. నేటి జెన్‌జీ తరానికి అవసరమైన స్థాయిలో సేవలు అందించాలంటే, విద్యాసంస్థలు మరెంతో క్రియాశీలకంగా పని చేయాలి. ప్రస్తుత యువత ఆధునిక సాంకేతిక విద్యను అభ్యసించక తప్పని పరిస్థితుల్లో, మెరుగైన కెరీర్ కోసం నైపుణ్యాలను అందిపుచ్చుకుంటూ, విభిన్న రంగాల్లోకి అడుగుపెట్టడానికి ఉత్సాహం చూపుతోంది. వారికి అవసరమైన రీతిలో నైపుణ్యాలను అందించడంలో ప్రభుత్వ రంగంలోని విశ్వవిద్యాలయాలు వెనకంజవేస్తున్నాయనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో విశ్వవిద్యాలయాలకు స్వయంప్రతిపత్తి అనేది కేవలం పరిపాలనపరంగా మాత్రమే కాకుండా బోధనా శాస్త్రాలు, విద్యార్థుల నైపుణ్యాలను అంచనా వేసే విధానాలు, పాఠ్యప్రణాళికలను పూర్తిచేయడం వంటి అంశాల్లోనూ అవసరం. అదేవిధంగా అధ్యాపకుల ఎంపిక, సంస్థ నిర్మాణం, అంతర్గత పరిపాలన కూడా ఎంతో ముఖ్యం. మరో అతి ముఖ్యమైన అంశం ఆర్థిక స్వయంప్రతిపత్తి. ఫీజులను తామే నిర్ణయించుకోవడం, వనరులను సమకూర్చుకోవడం, వాటిని తామే వినియోగించుకోవడం, ఇతర విద్యా సంస్థలతో అనుసంధానం కావడానికి ఇది ఉపకరిస్తుంది. పరిపాలనాపరమైన అనుమతులు పొందడానికి, పరిశోధన అంశాలను నిర్ణయించడానికి, తమ విశ్వవిద్యాలయానికి చెందిన మేధోసంపత్తి హక్కులపై నిర్ణయాలు తీసుకోవడానికి కూడా స్వయంప్రతిపత్తి ఎంతో అవసరం.

### పాత పద్ధతుల్లోంచి బయటికి రావాలి

పలు రంగాల్లో వేగంగా మారుతున్న సాంకేతికతలకు అనుగుణంగా విశ్వవిద్యాలయాలు సిలబస్‌ను ఎప్పటికప్పుడు మార్చుకోవాలి. తదనుగుణంగా అధ్యాపకులకు శిక్షణ అందిస్తూ, వివిధ విద్యావిభాగాలను సమ్మిళితం చేసే కార్యక్రమాలు అమలు చేయాలి. జెన్‌జీ తరం విద్యార్థులు కోరుకుంటున్న నైపుణ్యాలను అందిస్తూ, వారిని స్టార్టప్ దిశగా ప్రోత్సహిస్తూ, లైవ్ ప్రాజెక్టులు వంటివి అందించాలి. పరిశ్రమలతో కలిసి నైపుణ్య ప్రాధాన్య డిగ్రీలను అందుబాటులోకి తీసుకురావాలి. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న అన్నింటికీ ఒకే సూత్రం లాంటి పాత పద్ధతులు మారితేనే ఇదంతా సాధ్యమవుతుంది. హార్వర్డ్, కేంబ్రిడ్జ్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ వంటి విశ్వవిద్యాలయాలు అత్యున్నత స్వయంప్రతిపత్తితో పనిచేస్తుంటాయి. స్వయంప్రతిపత్తి లేకపోతే, అంతర్జాతీయ స్థాయి అధ్యాపకులు, విద్యార్థులను ఆకర్షించడం, పరిశోధనలకు అవసరమైన నిధులను పొందడంలో భారతదేశ విశ్వవిద్యాలయాలు వెనకంజవేసే అవకాశం ఉంది. స్వయంప్రతిపత్తి ఉంటే, విదేశీ విద్యాసంస్థలతో కలిసి కార్యక్రమాలు చేపట్టడం, పరిశోధన కేంద్రాలను ఏర్పాటుచేయడం, సామాజిక అవసరాలకు తగ్గట్లుగా ప్రాజెక్టులను రూపొందించుకోవడం సాధ్యమవుతుంది. ఒక విశ్వవిద్యాలయం నుంచి వచ్చే పట్టభద్రుడికి దక్కే ఉద్యోగావకాశాలు, పరిశోధక అవకాశాలు, వారి ద్వారా సమాజంపై పడే ప్రభావం వంటి అంశాలు మాత్రమే యూనివర్సిటీ స్థాయిని నిర్ణయించాలి. ఇదంతా వర్సిటీలకు స్వయంప్రతిపత్తి కల్పించి, బాధ్యతలను పెంచడం ద్వారానే సాధ్యం. సింగపూర్‌లోని విశ్వవిద్యాలయాలు స్వయంప్రతిపత్తి కలిగి ఉన్నా ప్రభుత్వానికి జవాబుదారీగా ఉంటాయి. జర్మనీలో విశ్వవిద్యాలయాలు అందించే పరిశోధనా ఫలితాలే వాటికి దక్కే నిధులను నిర్దేశిస్తాయి. అంతేగానీ, పరిపాలనా విధానాలు కాదు. బ్రిటన్‌లోని స్వతంత్ర నిపుణుల నాణ్యతా సంస్థ విశ్వవిద్యాలయాలు పాటించాల్సిన ప్రమాణాలను నిర్దేశిస్తుంది తప్ప, వాటి అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోదు. విశ్వవిద్యాలయాలపై సర్కారీ యంత్రాంగం నియంత్రణ- ఆ విద్యాసంస్థల అంతర్గత నిర్ణయాలు ఆలస్యమయ్యేలా చేస్తోంది. స్వయంప్రతిపత్తి కాగితాలకే పరిమితం కావటం వల్ల, ఏఐ తదితర అధునాతన కోర్సులను వర్సిటీలు అందిపుచ్చుకోవడం ఆలస్యమవుతోంది. దీనివల్ల భారతీయ విద్యార్థులకు అధునాతన విద్య అందడంలేదు. ఫలితంగా సరైన ఉద్యోగాలు పొందలేకపోతున్నారు.

### ప్రపంచస్థాయిలో పోటీ పడాలంటే...

మన ఉన్నతవిద్యా వ్యవస్థ ప్రపంచస్థాయిలో పోటీ పడాలంటే- విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తి అనేది విధానపరంగా ఉండకూడదు. ఒక విద్యాసంస్థలో చదివే విద్యార్థులకు దక్కుతున్న ఉద్యోగావకాశాలు, పరిశోధన ఫలితాలు, సమాజంపై అవి చూపే ప్రభావం తదితర అంశాల ద్వారా స్వయంప్రతిపత్తి కల్పించాలి. అధ్యాపకులు, విద్యార్థుల బృందాలు స్థానికంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, సామాజిక బాధ్యతను నిర్వర్తించడం ద్వారా వర్సిటీల నాణ్యత పెంచడంలో భాగస్వాములు కావాలి. తద్వారా స్వయంప్రతిపత్తి అనేది ఒక అధికారం కాదని, బాధ్యత అనే సంగతి అవగతమవుతుంది. రేపటితరం ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యాన్ని అందుకోవాలంటే విశ్వవిద్యాలయాలకు విద్య, పాలన, ఆర్థిక, పరిశోధనపరమైన స్వయంప్రతిపత్తి కల్పించడం తప్పనిసరి

# భారత్-ఈయూ వాణిజ్యం



అగ్రరాజ్యం అమెరికా దుందుడుకు, దుస్సాహసిక చర్యలతో అంతర్జాతీయ ఆర్థిక, వ్యూహాత్మక రంగాల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దాదాపు ఖరారైందనే వార్త ప్రపంచవ్యాప్తంగా సంచలనం కలిగించింది. సుదీర్ఘ చర్చల అనంతరం ఈయూ-భారత్ మధ్య వాణిజ్య సయోధ్య కొలిక్కి రావడం ముదావహం. త్వరలో సంతకాలు జరుగనున్న ఒప్పందాన్ని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' (అన్ని ఒప్పందాలకు జేజెమ్మ లాంటి ఒప్పందం) అని అందరూ పిలుస్తున్నట్టు ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా ఫాన్ డెర్ లెయెన్ పేర్కొనడం ప్రపంచవ్యాప్తంగా పతాకశీర్షికగా నిలిచింది. అమెరికా ఒంటెత్తు వాణిజ్య పోకడలతో విసిగిపోయిన ఇరుపక్షాలూ ఉభయతారకమైన రీతిలో ఏకాభిప్రాయనికి రావడంపై వాణిజ్యవర్గాల్లో హర్షామోదాలు వ్యక్తమవుతున్నాయి. టారిఫ్‌లను ఆయుధాల్లా విసురుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఈ పరిణామం పెద్ద ఎదురుదెబ్బ. భారత్, ఈయూ సరుకులపై ఎడాపెడా టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. వీటిని తప్పించుకునేందుకే భారత్, ఈయూ ఆగమేఘాల మీద ఒప్పందంపై నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందనేది పైకి తెలుస్తూనే ఉంది. భారత్-ఈయూ ఒప్పందానికి సానుకూల వాతావరణం ఏర్పడిందన్న ఆశావహ వార్తల వల్ల సహజంగానే ఈ ఒప్పందంలో ఏమేం ఉండబోతున్నాయనే ఆసక్తి ఎక్కువైంది. భారత్, ఈయూ చారిత్రికంగా పటిష్టమైన వాణిజ్య సంబంధాలను కలిగి ఉన్నాయి. 2024లో ద్వైపాక్షిక వాణిజ్యం 135 బిలియన్ డాలర్లుగా ఉంది. ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా పేరుపొందిన భారత్ జీడీపీ అభివృద్ధి 7.3 శాతం మేర ఉంటుందని ఐఎంఎఫ్ అంచనా వేస్తున్నది. అటు ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చెందిన ఆర్థికశక్తి ఈయూ అనేది తెలిసిందే. 146 కోట్ల పైచిలుకు జనాభాతో కూడిన భారత్ ఈయూకు సువిశాలమైన మార్కెట్‌ను అందిస్తుంది. అమెరికా, చైనా ఒత్తిడులతో నిమిత్తం లేకుండా పరస్పర ప్రయోజనకర వాణిజ్య నిర్వహణకు ఈ ఒప్పందం వీలు కల్పిస్తుంది. ప్రత్యేకించి భారత్‌కు కలిగే ప్రయోజనాలు ఏమిటని ఆలోచిస్తే పలు అంశాలు ముందుకు వస్తున్నాయి. తాజా సంకేతాలను బట్టి అమెరికాకు ఎగుమతి చేయలేకపోయిన సరుకులకు ఈయూలో అవకాశాలు ఏర్పడుతాయి. ఈయూలోని 27 దేశాలు భారత్ సరుకులు, సేవలకు ఈ ఒప్పందం విశాల ద్వారాలు తెరుస్తుంది. ముఖ్యంగా భారతీయ ఫార్మా, ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు ఈయూ పెద్ద మార్కెట్‌గా నిలుస్తుంది. అమెరికా టారిఫ్‌ల కారణంగా దెబ్బతిన్న భారతీయ టెక్స్‌టైల్, ఆభరణాలు, చర్మ ఉత్పత్తుల పరిశ్రమలకు ఊరట లభిస్తుంది. భారతీయ దుస్తులపై ప్రస్తుతం ఉన్న 10 శాతం ఈయూ టారిఫ్ రద్దయిపోతుంది. అమెరికా ఒత్తిడితో సమస్యలు ఎదుర్కొంటున్న భారతీయ ఐటీ, సేవల రంగానికి ఈయూ ప్రత్యామ్నాయంగా చేతికి అంది వస్తుంది. అస్థిరతలు, అడ్డుకట్టలు తొలిగి, వాణిజ్య సహకారం కొత్తపుంతలు తొక్కుతుందనే ఆశాభావం వ్యక్తమవుతున్నది. వ్యూహాత్మక రంగంలోనూ భారత్, ఈయూ సహకారం విస్తరణకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని అంటున్నారు. ట్రంప్ టారిఫ్‌ల పుణ్యమా అని ఈ కీలక ఒప్పందం సత్వరమే కుదిరిందని చెప్పడం సత్యదూరం కాదు.

### "కొద్దిగా తిన్నా బరువెక్కుతున్నారా"

# ఏం తినాలి ఎంత తినాలో తెలుసా

**ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం కసరత్తు చేస్తున్నారా – "ఫిట్ హోగా భారత్"లో ఇపుడే పాల్గొనండి!**



రోజూ ఎంత తినాలి? ఏం తినాలి ఎన్ని సార్లు తినాలి? అనేది మీ సందేహమా! ఎంత తక్కువ తిన్నా బరువు పెరుగుతున్నామనే ఆందోళనా? పూర్తి బాడీ ఫిట్ నెస్, న్యూట్రిషన్ ఫుడ్ గురించి మీరు ఎక్కడెక్కడో వెతకాల్సిన అవసరం లేదు. సమస్త సమాచారాన్ని "ఫిట్ హోగా భారత్" మీకు అందిస్తోంది.

### వ్యాధుల భారంలో 56 తిండి వల్లే :

జీవనశైలి, ఆహారపు అలవాట్లలో చోటు చేసుకుంటున్న మార్పులు ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతున్నాయి. జంక్‌ఫుడ్‌కు తోడు వ్యాయామం లేకపోవడం, నిద్ర విషయంలో వేళలు పాటించకపోవడం వల్ల వ్యాధులు పెరుగుతున్నాయి. 56 శాతం రోగాలకు అనారోగ్యకర ఆహారమే కారణమని పరిశోధకులు చెప్తున్నారంటే ఎంతగా మారిపోయామో ఆలోచించుకోవాల్సిందే. మంచి ఆరోగ్యం కోసం ఏం తినాలి? అనే విషయాన్ని జాతీయ పోషకాహార సంస్థ "డైటరీ గైడ్‌లైన్స్ ఫర్ ఇండియన్స్" పేరుతో విడుదల చేసింది.

### కష్టాల 'బరువు' పెంచకండి :

బరువు పెరుగుతున్నా కొద్దీ శరీరం జబ్బుల బారిన పడుతుంది. మానసిక ఆందోళన పెరుగుతున్నాయి. బీపీ, షుగర్, గుండె జబ్బుల ముప్పు పొంచి ఉంటుంది. అధిక చక్కెర, కొవ్వు, ఉప్పు ఎక్కువగా ఉండే చిప్స్, పిజ్జాలు, బర్గర్లు, కూల్‌డ్రింక్స్ (అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారం) తగ్గించాలి.

### పరిమితంగా ప్రొటీన్ సప్లిమెంట్ల వాడకం :

ప్రొటీన్ సప్లిమెంట్ల బదులు ఉడికించిన గుడ్లు, పాలు, సోయాబీన్స్, బఠానీలు తీసుకోవాలి. ప్రొటీన్ పౌడర్లలో కృత్రిమ రుచి కోసం చక్కెర లేదా స్వీటెనర్లు కలుపుతున్నారు. దీంతో చాలా మంది వీటికి ఆకర్షితులవుతున్నారు. మనం తీసుకునే ఆహారంలో షుగర్ అంతర్గతంగా ఉంటుంది కాబట్టి అదనంగా చక్కెర తీసుకోవాల్సిన అవసరమే లేదు. ఒక వేళ తప్పని సరి అయితే, రోజుకు 25 గ్రాములలోపే తీసుకోవాలి.

### సమతుల ఆహారమే ఆరోగ్య సూత్రం :

సమతుల ఆహారంలో భాగంగా కూరగాయలు, పప్పులు, చిక్కుళ్లు సమృద్ధిగా తీసుకోవాలి. దుంపలు, పిండిపదార్థాలు తగ్గిస్తూ రోజుకు 250 గ్రాముల ధాన్యాలు తీసుకోవాలి. బియ్యం మాత్రమే కాకుండా చిరుధాన్యాలు కలిపి తీసుకోవడం మంచిది. పప్పుదినుసుల వల్ల ప్రొటీన్లు ఎక్కువగా లభిస్తాయి. మంచి కొవ్వు కోసం రోజుకు 25 నుంచి 35 గ్రాముల నూనె గింజలు (వేరుసెనగ, గుమ్మడి గింజలు, బాదం వంటివి) తీసుకోవాలి. బరువు పెరగకుండా ఎప్పటికప్పుడు వ్యాయామాలు చేస్తుండాలి.

### ఆహారంలో భాగం కావాల్సినవి :

రోజుకు దాదాపు 2000 కేలరీల శక్తి శరీరానికి అవసరం అనుకుంటే అందులో 250 గ్రాముల తృణధాన్యాలు, 400 గ్రాముల కూరగాయలు, 100 గ్రాముల పండ్లు, 85 గ్రాముల పప్పులు లేదా మాంసం లేదా కోడిగుడ్డు, 35 గ్రాముల పప్పుగింజలు, 27 గ్రాముల కొవ్వు పదార్థాలు లేదా నూనె తీసుకోవాలి. కేవలం అన్నం, కూర, పప్పు, పెరుగు కాకుండా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు రోజూ తప్పనిసరి చేసుకోవాలి.

### టీ, కాఫీలు అతిగా వద్దు :

కప్పు కాఫీలో 80-120 మిల్లీగ్రాముల కెఫీన్, ఇన్‌స్టంట్ కాఫీలో 50-65 మి.గ్రా ఉంటుంది. అదే కప్పు టీలో 30-65 మి.గ్రా.కెఫీన్ ఉంటుంది కాబట్టి రోజుకు 300.మి.గ్రా.కు మించి కెఫీన్ తీసుకోకూడదు. అతిగా కాఫీ తాగడం వల్ల రక్తపోటు సమస్య వస్తుంది. అతిగా టీ, కాఫీలకు తోడు శీతల పానీయాలు తీసుకుంటే టైప్-2 మధుమేహం బారిన పడతారని హైదరాబాద్ లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్) పరిశోధకులు వెల్లడించారు.

### శాకాహారంలోనూ ఫుల్ ప్రొటీన్ :

గుడ్లు, చికెన్, మటన్, చేపలతో మాంసాహారులకు ప్రొటీన్ దండిగా లభిస్తుంది. కానీ, శాకాహారులకు అంతకు మించిన ప్రొటీన్ వనరులు ఉన్నాయి.

భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎమ్ఆర్-ఎన్ఐఎన్)సిఫారసుల ప్రకారం 19-50 ఏళ్ల మహిళలకు 46-50 గ్రాముల ప్రొటీన్ అవసరం ఉంటుంది. పొద్దంతా కష్టపడే, వర్కవుట్లు చేసే ఆడవాళ్లు 66-110 గ్రాముల వరకు తీసుకోవచ్చు. పెసరపప్పు, శనగలు, మినపప్పు, పాలు, పాల ఉత్పత్తులైన పెరుగు, పనీర్ వంటివాటిల్లో ప్రొటీన్ అధికంగా ఉంటుంది. 30 గ్రాముల సోయాబీన్స్ నుంచి రోజుకు అవసరమైన మాంసకృత్తుల్లో 72 శాతం పొందవచ్చు. నువ్వులు, అవిసెగింజలు, గుమ్మడిగింజలు రోజుకో పెద్ద చెంచా పరిమాణంలో తీసుకుంటే చాలు. రోజుకు సరిపడా మాంసకృత్తుల్లో 30 శాతం లభిస్తాయి. పిస్తా, జీడిపప్పులతో పోలిస్తే బాదంలో మాంసకృత్తులు ఎక్కువ. రోజూ పది గింజల్ని నానబెట్టుకుని తీసుకోవాలి. మొక్కజొన్నలో మాంసకృత్తులు, పల్లీ చట్నీ, పీనట్ బటర్ నుంచి కూడా కావలసినన్ని ప్రొటీన్లు అందుతాయి. నిర్వహిస్తున్న 30 రోజుల ఫిట్ ఛాలెంజ్‌లో పాల్గొనండి. మరిన్ని వివరాలు, ఆరోగ్యకరమైన వంటకాలు, జీవనశైలి చిట్కాల కోసం జుఎ భారత్ క్లిక్ చేయండి. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# 'మోడ్రన్ పేరెంట్స్'.. పిల్లల పెంపకం సవాళ్లను ఇలా అధిగమించండి!

**పిల్లల పెంపకంలో మోడ్రన్ పేరెంట్స్ తీవ్రమైన సవాళ్లు ఎదుర్కొంటున్నారు. 70 మంది పనుల భారం వల్ల పిల్లలను పట్టించుకోవట్లేదట.**



పిల్లల పెంపకంలో మోడ్రన్ పేరెంట్స్ తీవ్రమైన సవాళ్లు ఎదుర్కొంటున్నారు. 70% మంది తల్లిదండ్రులు పనుల భారం వల్ల అలసిపోతున్నారు. దీనివల్ల బాలల మానసికస్థితిని పట్టించుకోకుండా తరచుగా ఎడ్యుకేషన్, ఫుడ్, క్రమశిక్షణ వంటి ఫిజికల్ యాక్టివిటీస్‌పైనే ఒత్తిడి చేస్తున్నారని చైల్డ్ సైకాలాజిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల మెంటాల్టీని అర్థం చేసుకోవాడానికి అసలే ట్రై చేయట్లేదు. ఎంతసేపు వారి నీడ్స్ తీర్చడమే రిలీఫ్‌గా ఫీల్ అవుతున్నారు. సీరియస్ పెరెటింగ్, ఓవర్ కేరింగ్, నిర్లక్ష్యం వంటి అనేక కారణాలతో చాలా మంది పేరెంట్స్ వారికి తెలియకుండానే పిల్లల ఎమోషనల్, మెంటల్ హెల్త్, కాన్ఫిడెన్స్ వంటి వాటిపై ప్రతికూల ప్రభావం వేస్తున్నారని, ఈ తరహా శైలిని అవలంభించడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### సీరియస్ పేరెంటింగ్:

ఇంట్లో కఠినమైన నియమాలు పెట్టడం వల్ల పిల్లలు వారి అభిప్రాయాలను స్వేచ్ఛగా షేర్ చేసుకోలేరు. పేరెంట్స్ విధించే రూల్స్‌ను అర్థంచేసుకోవడం కంటే భయంతోనే గడుపుతుంటారు. ఇలాంటి వాతావరణంలో పెరిగిన పిల్లలు క్రమశిక్షణతో ఉన్నట్లు కనిపించినప్పటికీ ఎల్లప్పుడూ తమ ఫ్రీడమ్‌ను హరించివేస్తున్న భావోద్వేగాలతో ఆందోళనకు గురవుతుంటారు. కాలక్రమేణా ఇది పెద్దలపై తిరుగుబాటుకు కూడా దారితీయవచ్చు. తల్లిదండ్రులు కొంతసమయం పిల్లల ఇష్టాలు, ఆటల్లో భాగం అవుతూనే ఇంట్లో నియమాల వెనుక ఉన్న కారణాన్ని వివరించి అర్థం చేయించాలి. పిల్లలు తమను తాము స్వేచ్ఛగా వ్యక్తీకరించుకునేలా ప్రోత్సహించాలని సైకాలాజిస్టులు సూచిస్తున్నారు.

### ఫుల్ ఫ్రీడమ్:

ఈ తరం పిల్లలకు ఎలాంటి హద్దులు గీయకుండా పూర్తి స్వేచ్ఛతో పెంచడంకూడా ప్రమాదకరంగా మారుతోంది. కొంతమంది అతిగారాబం ప్రాణాలమీదకు తెస్తోంది. ఇది వద్దు, అలా చేయకు, ఇలాగే ఉండాలి, ఏది ఎంత వరకు అవసరం అనేది చెప్పకుండా డిమాండ్ చేసిన వెంటనే కొనిపెట్టడం వల్ల స్వయంగా పేరెంట్సే వారిలో క్రమశిక్షణ రాహిత్యాన్ని ప్రోత్సహించినట్లు అవుతుంది. పూర్తి స్వేచ్ఛకు అలవాటు పడిన పిల్లలు చదువుతోపాటు తప్పు, ఒప్పుల మధ్య తేడాను గుర్తించడంలో విఫలమవుతుంటారు. తమకు నచ్చినట్లు ఏది చేయకపోయినా అసహనానికి గురికావడం లేదా చిరాకు పడుతుంటారు. తమ ఇష్టాలను కాదంటే కొన్నిసార్లు ప్రాణాలు తీసుకుంటారు లేదంటే ప్రాణం తీయడానికి కూడా వెనకాడరు. అందుకే స్వేచ్ఛలోనూ స్పష్టమైన సరిహద్దులుండాలని నిపుణులు చెబుతున్నారు.

### నిర్లక్ష్యం డేంజర్:

తల్లిదండ్రులు పిల్లలపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం కూడా ఆందోళన కలిగించే అంశమే. ఉరుకుల పరుగుల జీవితంలో పని ఒత్తిడి కారణంగా పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇచ్చి వదిలేయడం, టీవీ పెట్టి గదిలో కూర్చోబెట్టడం, వారి ఎమోషనల్ నీడ్స్‌ను పట్టించుకోకపోవడం వంటివి చేస్తుంటారు. ఇలాంటి సమయాల్లోనే పిల్లలు తమను తాము ఒంటరిగా ఫీల్ అవుతారు. చాలా సందర్భాల్లో పేరెంట్స్ నిర్లక్ష్యమే పిల్లల్లో ప్రతికూల ఆలోచనలు, హానికరమైన పనులకు దారితీస్తుంది. పిల్లలు పెరుగుతున్నకొద్దీ ఇతరులను గౌరవించకపోవడంతోపాటు చివరకు పేరెంట్స్ పట్లకూడా ప్రేమను కలిగివుండలేరు. అందుకే ప్రతిరోజూ కొంత సమయాన్ని పిల్లలకోసం కేటాయించి, వారి ఆనందాలతో తప్పనిసరిగా కనెక్ట్ కావాల్సిందే.

### ఇతరులతో పోలిక:

పోలిక అనేది పిల్లల ఎమోషనల్ డెవలప్‌మెంట్‌పై చాలా ఎఫెక్ట్ చూపిస్తుంది. తోబుట్టువులు, క్లాస్‌మేట్స్, ఫ్రెండ్, చుట్టాల పిల్లలు వంటి వారి టాలెంట్, ఫిజికల్ యాక్టివిటీస్‌తో పోల్చడం వారి జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీనివల్ల తమను తాము పనికిరాని వారిగా భావిస్తారు. సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పూర్తిగా దెబ్బతీంటుంది. 10శాతం పిల్లలు కూడా పోలికలను పోటీగా తీసుకోలేరని, ఎవరితోనైతే పోలుస్తామో వారిపట్ల కోపం లేదా అసూయ కలుగుతుందని సైకాలాజిస్టులు చెబుతున్నారు. తోబుట్టువుల మధ్య లేదా స్నేహితుల మధ్య ఆరోగ్యకరమైన సంబంధాలు దెబ్బతింటాయి. తమ మనసులో ఉన్న విషయాలను కూడా తల్లిదండ్రులతో పంచుకోవడం మానేస్తారు. ఇది వారి సహజమైన క్రియేటివిటీనీ దూరం చేస్తుంది. ప్రతి ఒక్కరికి టాలెంట్, కాన్ఫిడెన్స్, ఉంటుంది. దానిని గుర్తించి ప్రోత్సహిస్తే తమనుతాము తీర్చిదిద్దుకుంటారు.

### ఓవర్ కేరింగ్:

పిల్లలపై ప్రేమ ఉండటం సహజం. కానీ అది ఓవర్ కేరింగ్‌కు దారితీస్తేనే ప్రమాదంగా మారుతుంది. వారి చుట్టూ ఎల్లప్పుడూ ఒక రక్షణ కవచంలా ఉండటం వల్ల వారు బయటి ప్రపంచాన్ని చూసి భయపడతారు. చిన్నపాటి వైఫల్యాన్ని కూడా తట్టుకోలేక తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతారు. స్వాతంత్ర్యంగా ఏ చిన్న నిర్ణయం తీసుకోలేకపోతారు. సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోలేరు. 'నేను సొంతంగా ఏదీ చేయలేనేమో' అనే భావన పిల్లల్లో ఏర్పడుతుంది. ఏం తినాలి, ఏం చదవాలి, ఎవరితో స్నేహం చేయాలి అనే విషయాల్లో పేరెంట్స్ అతిగా జోక్యం చేసుకుంటే... పిల్లలు సొంతంగా ఆలోచించే శక్తిని కోల్పోతారు. పెద్దయ్యాక కూడా ప్రతి నిర్ణయానికి ఇతరులపై ఆధారపడతారు. తమ తప్పులను కప్పిపుచ్చడానికి లేదా తాము చేసిన పొరపాట్లను సరిదిద్దడానికి పేరెంట్స్ ఉంటారనే భావనతో జవాబుదారీతనం ఉండదు. కాబట్టి మీరు ఎల్లప్పుడు మార్గదర్శిగా ఉండండి. అధికారిలా కాకుండా వెనకుండి నడిపించే తోడుగా ఉండండి. చిన్న చిన్న తప్పుల ద్వారానే పిల్లలు జీవిత పాఠాలు నేర్చుకుంటారు.

### పిల్లల పెంపకం ఒక కళ:

పిల్లలు మన ద్వారా ఈ ప్రపంచంలోకి వస్తారు. కానీ వారు మన ఆస్తి కాదు. వారికి సొంత ఆలోచనలు, కలలు ఉంటాయి. వాటిని అర్థం చేసుకుని ప్రోత్సహించడమే నిజమైన పెంపకం. నేటి తరం పిల్లలు మనం ఊహించినదానికంటే చాలా ఫాస్ట్‌గా ఉంటున్నారు. కాబట్టి ముందుగా వారి మానసిక స్థితిని అర్థం చేసుకోవాలి. రోజులో కనీసం గంట సేపు వారితో మాట్లాడాలి. రోజంతా స్కూల్లో ఏం జరిగింది? స్నేహితులతో కలిసి ఏం చేశారు? వంటి విషయాలను అడిగి తెలుసుకోవాలి. పిల్లలముందు, పిల్లలతో అబద్ధాలు చెప్పకూడదు. ఎందుకంటే పిల్లలు పేరెంట్స్‌ను అనుకరిస్తారు. ఫోన్, మొబైల్ ఇతరత్రా గ్యాడ్జెట్స్ కంటే ఫిజికల్ యాక్టివిటీస్‌కు ప్రయారిటీ ఇవ్వండి. ముఖ్యంగా గ్రాండ్ పేరెంట్స్‌కు దగ్గర చేయండి. వారితో ముచ్చట్లు, ఆటలు, ఇతర విషయాలు తెలుసుకునే స్వేచ్ఛను కల్పించాలని చైల్డ్ సైకాలాజిస్టులు సూచిస్తున్నారు.

# ఒక్కరోజులోనే రూ.18వేలు తగ్గిన వెండి ధర- మరి బంగారం ఎంత తగ్గిందంటే?

**భారీ తగ్గిన వెండి- స్వల్పంగా తగ్గిన బంగారం- ధరల వివరాలు మీకోసం!**

బంగారం, వెండి కొనుగోలుదారులకు తాజాగా ఊరట లభించింది. ముఖ్యంగా వెండి ధర ఒక్కరోజులోనే భారీగా పడిపోవడం గమనార్హం. గురువారం నాడు కిలో వెండి ధర ఏకంగా రూ.18 వేల వరకు తగ్గింది. ప్రస్తుతం మార్కెట్ లో కిలో వెండి ధర రూ.3,12,000కు చేరింది. ఇటీవల రోజుల్లో ఎప్పుడూ లేని విధంగా ఇంత పెద్ద స్థాయిలో వెండి ధర తగ్గడం ఆశ్చర్యకరమైన విషయమే.

### బంగారం సంగతేంటి

బంగారం ధరల్లో కూడా స్వల్ప మార్పు కనిపిస్తోంది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ప్రస్తుతం రూ.1,41,450గా ఉంది. గత కొన్ని రోజులుగా బంగారం ధరలు ఎగబాకిన నేపథ్యంలో ఈ తాజా తగ్గుదల కొంత ఊరటనిచ్చిందని చెప్పాలి. హైదరాబాద్‌తోపాటు తెలుగు రాష్ట్రాల్లోని విజయవాడ, ప్రొద్దుటూరు నగరాల్లో కూడా బంగారం ధర అంతే ఉంది.

**తగ్గడానికి కారణాలు ఇవేనా**

అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం దేశీయ బులియన్ మార్కెట్‌పై నేరుగా పడుతోంది. అమెరికా డాలర్ బలపడటం, అంతర్జాతీయంగా బంగారం వెండి ధరల్లో తగ్గుదల రావడం ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. ఇటీవల అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై కఠిన వైఖరి కొనసాగిస్తుందన్న అంచనాలు వెలువడడంతో ప్రపంచవ్యాప్తంగా లోహాల ధరలపై ఒత్తిడి పెరిగింది.

వెండి డిమాండ్ తగ్గిందా

మరోవైపు, చైనా, యూరప్ వంటి ప్రధాన దేశాల్లో పరిశ్రమల డిమాండ్ తగ్గడం కూడా వెండి ధరపై ప్రభావం చూపిందని తెలుస్తోంది. వెండి ఎక్కువగా పరిశ్రమల్లో వినియోగం కావడం వల్ల గ్లోబల్ మాంద్య భయాలు పెరిగినప్పుడు దీని ధరలు త్వరగా పడిపోతుంటాయి. ప్రస్తుతం అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి కొనసాగుతుండటంతో పెట్టుబడిదారులు వెండి నుంచి కొంత వెనక్కి తగ్గినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

దేశీయంగా కూడా ప్రభావం

దేశీయంగా కూడా డిమాండ్ కొంత తగ్గింది. పెళ్లిళ్ల సీజన్ ముగియడం, పండుగల కొనుగోళ్లు తగ్గడం వల్ల బంగారం వెండి విక్రయాలు మందగించాయి. వ్యాపారులు నిల్వలు ఎక్కువగా ఉండటంతో ధరలను తగ్గిస్తూ విక్రయాలు పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే సమయంలో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే కొంత బలపడటం కూడా ధరలపై సానుకూల ప్రభావం చూపింది.

వినియోగదారులకు మంచి అవకాశం

ధరలు తగ్గడంతో బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశంగా మారింది. ముఖ్యంగా పెళ్లిళ్లు, శుభకార్యాల కోసం నగలు కొనుగోలు చేసే కుటుంబాలకు ఈ తగ్గుదల లాభం చేకూర్చనుంది. వెండి ధర ఒక్కరోజులో రూ.18 వేల వరకు తగ్గడం అరుదైన సంఘటన కావడంతో చాలా మంది కొనుగోలుదారులు దుకాణాల వైపు మొగ్గు చూపుతున్నారు.

ముందురోజుల్లో పరిస్థితి ఎలా

మార్కెట్ నిపుణుల అంచనాల ప్రకారం, అంతర్జాతీయంగా డాలర్ బలం కొనసాగితే, ఫెడ్ వడ్డీ రేట్లపై కఠిన నిర్ణయాలు తీసుకుంటే బంగారం వెండి ధరల్లో మరింత ఒడిదుడుకులు కనిపించే అవకాశం ఉంది. అయితే, ప్రపంచ రాజకీయ పరిణామాలు, మాంద్య భయాలు పెరిగితే మళ్లీ పెట్టుబడిదారులు మొగ్గు చూపవచ్చని చెబుతున్నారు. అలా జరిగితే ధరలు మళ్లీ ఎగబాకే అవకాశమూ లేకపోలేదు.

కొనుగోలుదారులకు సూచనలు

నిపుణుల సూచన ప్రకారం, దీర్ఘకాల పెట్టుబడిగా బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వారు ధరలు తగ్గిన సమయంలో దశలవారీగా కొనుగోలు చేయడం మంచిదని చెబుతున్నారు. ఒక్కసారిగా పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టకుండా, మార్కెట్ పరిస్థితిని గమనిస్తూ నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు. మొత్తంగా చూస్తే, ఒక్కరోజులో భారీగా పడిపోయిన వెండి ధర మార్కెట్లో చర్చనీయాంశంగా మారింది. బంగారం ధరల్లోనూ స్వల్ప తగ్గుదల రావడంతో వినియోగదారులకు కొంత ఊరట లభించింది.

# మీ సిబిల్ స్కోర్ తగ్గిందా.. హోమ్ లోన్ ఇవ్వరు జాగ్రత్త!

**ఎవరికైతే 700 నుంచి 725 వరకు సిబిల్ స్కోర్ ఉంటుందో వారు అధిక వడ్డీ రేటును చెల్లించాల్సి వస్తుంది. ఒకే ఆదాయం, ఒకే విలువ కలిగిన ఇద్దరు రుణ గ్రహీతలు వారి క్రెడిట్ చరిత్ర ఆధారంగా వేర్వేరు రేట్లను పొందుతారు.**




సొంతింటి కలను నెరవేర్చుకోవాలనుకుంటున్నారా? సరిపడా డబ్బులుంటే పర్లేదు. కానీ.. లోన్ తీసుకోవాలనుకుంటే మాత్రం కాస్త ఆలోచించాల్సిందే. ఎందుకంటే మీ సిబిల్ స్కోర్ బాగా ఉంటేనే లోన్ ప్రాసెస్ ఈజీ అవుతుంది. లేదంటే కష్టమే! అందుకే ముందుగా మీ సిబిల్ స్కోర్ ఎలా ఉందో చెక్ చేసుకోండి. ఇది బాగుంటేనే వడ్డీ రేటు కూడా తగ్గిస్తారు. కాబట్టి మీరు లోన్ తీసుకోవాలనుకునే ప్లాన్ ఉంటే సరైన సిబిల్ స్కోర్ కూడా మెయింటైన్ చేయండి. ఇప్పటికే తీసుకున్న లోన్లను పూర్తిగా చెల్లించండి. అలాగే ఈఎంఐలను రెగ్యులర్‌గా చెల్లించండి. దీంతో సిబిల్ స్కోర్ బాగుంటుంది. అలాగే మీ సంపాదనపై 40% మించకుండా ఈఎంఐలు ఉండేలా చూసుకోవాలని ఫైనాన్షియల్ ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. అంతకు మించి ఈఎంఐలు చెల్లించాల్సి వస్తే పే చేయడంలో ఇబ్బందులు ఎదురై సిబిల్ స్కోర్ పడిపోవచ్చునని చెబుతున్నారు. సో.. స్థాయికి మించి రుణాలు తీసుకుంటే ఇబ్బందులు తప్పవు!

### సిబిల్ స్కోర్ 750

బ్యాంకు రుణాలు తీసుకోవాలనుకున్న వ్యక్తుల సిబిల్ స్కోర్ 750 కంటే ఎక్కువగా ఉండాలి. ఇలా ఉండటమే చెల్లింపుల్లో తక్కువ రిస్క్‌గా భావిస్తారు. బ్యాంకర్లు కూడా రుణాలు ఇచ్చేందుకు పోటీ పడతారు. పైగా హోమ్‌లోన్లు తక్కువ వడ్డీ రేట్లకు అర్హత పొందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీంతో 750 కంటే తక్కువ స్కోర్ ఉన్నవారు కూడా లోన్ పొందవచ్చు. కానీ వీరికి వడ్డీ రేటు ఎక్కువగా ఉంటుంది. ఇది సుదీర్ఘ కాల పరిమితిలో మొత్తం వ్యయాన్ని అధికంగా పెంచుతుంది. నిజానికి వడ్డీ రేటులో తేడా స్వల్పంగానే కనపడుతుంది. కానీ 15 నుంచి 20 ఏండ్ల కాల పరిమితిలో చెల్లించే మొత్తం చాలా ఎక్కువగానే ఉంటుంది.

### అధిక వడ్డీ

ఎవరికైతే 700 నుంచి 725 వరకు సిబిల్ స్కోర్ ఉంటుందో వారు అధిక వడ్డీ రేటును చెల్లించాల్సి వస్తుంది. ఒకే ఆదాయం, ఒకే విలువ కలిగిన కొలేటరల్ ఉన్న ఇద్దరు రుణ గ్రహీతలు వారి క్రెడిట్ చరిత్ర ఆధారంగా ప్రత్యేకంగా వేర్వేరు రేట్లను పొందుతారు. ఉదాహరణకు 750 కంటే ఎక్కువ క్రెడిట్ స్కోరు ఉన్న రుణగ్రహీతకు 650-700 మధ్య క్రెడిట్ స్కోరు ఉన్న రుణగ్రహీతతో పోలిస్తే 50-100 బేసిస్ పాయింట్లు తక్కువ రేటును మంజూరు చేయొచ్చు. అలాగే ఉమ్మడిగా రుణం తీసుకునేటప్పుడు కూడా ఇద్దరి సిబిల్ స్కోర్లను వేర్వేరుగానే పరిగణనలోకి తీసుకుంటారు. అందుకే లోన్ తీసుకోవడానికి ముందుగానే క్రెడిట్ స్కోర్ పెంచుకోవాలి.

### ఎలా పెంచుకోవాలి?

క్రెడిట్ స్కోర్ పెరగాలంటే ఆర్థిక క్రమ శిక్షణ కలిగి ఉండాలి. ఈఎంఐలు, క్రెడిట్ కార్డ్ బిల్లులు రెగ్యులర్‌గా గడువు తేదీలోపు చెల్లించాలి. క్రెడిట్ వినియోగ నిష్పత్తి మీ మొత్తం అందుబాటులో ఉన్న క్రెడిట్ పరిమితికి, మీరు వినియోగిస్తున్న క్రెడిట్‌కు సంబంధించిన అంశం. మీకు అందుబాటులో ఉన్న మొత్తం క్రెడిట్ లో మీరు వినియోగించే మొత్తం 30 శాతం లోపే ఉండాలి. ఉదాహరణకు మీ మొత్తం క్రెడిట్ పరిమితి రూ.లక్ష అయితే, మీ బకాయి బ్యాలెన్స్‌ను రూ.30 వేల కంటే తక్కువగా ఉంచడానికి ప్రయత్నించండి. ఇప్పటికే ఉన్న క్రెడిట్ కార్డ్ రుణాన్ని చెల్లించడమనేది ఈ నిష్పత్తిని మెరుగుపరచడానికి గల వేగవంతమైన మార్గాలలో ఒకటిగా చెప్పొచ్చు. రుణ గ్రహీత కొత్త రుణం, క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీసారి ఎంక్వైరీ చేస్తారు. ఇది కూడా స్కోరును తగ్గించవచ్చు. హోమ్‌లోన్ దరఖాస్తుకు ముందు నెలల్లో ఒకేసారి రెండు, మూడేసి క్రెడిట్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవద్దు. కారు, బైక్ వంటి లోన్లు, పర్సనల్‌లోన్లు వివిధ క్రెడిట్ రకాల బాధ్యతాయుతమైన నిర్వహణను ప్రదర్శిస్తుంది. అయితే ఇది కాలక్రమేణా అవసరానుగుణంగా ఉండాలి తప్ప, అనవసరమైన రుణాలు తీసుకోవడం ద్వారా ఉండకూడదు. మీరు ఇప్పటికే చెల్లించిన రుణాలు లేదా తప్పుడు వ్యక్తిగత వివరాలు వంటి ఏవైనా తప్పుల కోసం మీ క్రెడిట్ నివేదికను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తుండాలి. మీ స్కోరు మీ ఆర్థిక స్థితిని కచ్చితంగా ప్రతిబింబిస్తుందని నిర్ధారించుకోవడానికి ఇది చక్కటి మార్గం. ఈ అంశాలన్నీ సిబిల్ స్కోర్‌ను మెరుగుపరచడమే కాకుండా బలమైన ఆర్థిక పునాదిని కూడా నిర్మిస్తాయి. రుణగ్రహీతలు మెరుగైన రేట్లను పొందడానికి, గృహ రుణం జీవితకాల వ్యయాన్ని తగ్గించడానికి వీలు కల్పిస్తాయి.

# కేంద్ర బడ్జెట్ 2026: తొలి ప్రసంగం నుంచి హల్వా సాంప్రదాయం వరకు.. ఈ ఆసక్తికర విషయాలు తెలుసా..




కేంద్ర బడ్జెట్ అంటే ఎన్నో ఆశలు, ఆకాంక్షలు, ఎదురుచూపులు. ఒక ఆర్థిక సంవత్సరంలో దేశం గమనాన్ని నిర్దేశించేంది కేంద్ర బడ్జెట్. కేంద్ర బడ్జెట్-2026కు సమయం సమీపిస్తున్న తరుణంలో అనేక ఆసక్తికర సాంప్రదాయాలు, చారిత్రక విశేషాల గురించి తెలుసుకుందాం. కేంద్ర బడ్జెట్ 2026: తొలి ప్రసంగం నుంచి హల్వా సాంప్రదాయం వరకు.. ఈ ఆసక్తికర విషయాలు తెలుసా.. కేంద్ర బడ్జెట్ అంటే ఎన్నో ఆశలు, ఆకాంక్షలు, ఎదురుచూపులు. ఒక ఆర్థిక సంవత్సరంలో దేశం గమనాన్ని నిర్దేశించేది కేంద్ర బడ్జెట్. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. కేంద్ర బడ్జెట్-2026కు సమయం సమీపిస్తున్న తరుణంలో అనేక ఆసక్తికర సాంప్రదాయాలు, చారిత్రక విశేషాల గురించి తెలుసుకుందాం

భారత్ తొలి బడ్జెట్ ప్రసంగం

స్వాతంత్ర్యం తర్వాత భారతదేశ తొలి కేంద్రం బడ్జెట్‌ను 1947, నవంబర్ 26న అప్పటి ఆర్థిక మంత్రి ఆర్.కె. షణ్ముఖం చెట్టి ప్రవేశపెట్టారు. కాగా, బ్రిటిష్ పాలనలో భారతదేశ తొలి కేంద్ర బడ్జెట్‌ను ఏప్రిల్ 7, 1860న సమర్పించారు. బ్రిటిష్ పాలనలో అప్పటి భారతదేశ ఆర్థిక మంత్రి జేమ్స్ విల్సన్ ఈ బడ్జెట్‌ను సమర్పించారు

బడ్జెట్ సమయంలో మార్పు

బ్రిటిష్ పాలనలో కేంద్ర బడ్జెట్‌ను సాయంత్రం 5 గంటలకు ప్రవేశపెట్టేవారు. బ్రిటన్ కంటే భారతదేశం చాలా గంటలు ముందు ఉన్నందున అక్కడి కాలపు సాంప్రదాయం ప్రకారం సాయంత్రం ఐదు గంటలకు ప్రవేశపెట్టేవారు. 1999 నుంచి ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రవేశపెట్టే విధానం అమల్లోకి వచ్చింది. ఇక, 2017 నుంచి ఫిబ్రవరి 1వ తేదీన బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు. అంతకుముందు ఫిబ్రవరి నెల చివరి రోజున ప్రవేశపెట్టే వారు.

హల్వా సాంప్రదాయం

బడ్జెట్‌కు కొన్ని రోజుల ముందు ఆర్థిక మంత్రి హల్వా కార్యక్రమం నిర్వహిస్తారు. ఆర్థిక శాఖ కార్యాలయంలో పెద్ద పాత్రలో హల్వాను తయారు చేసి, బడ్జెట్ రూపకల్పనలో పాల్గొన్న అధికారులకు పంచుతారు. హల్వా పంచే కార్యక్రమం జరిగితే బడ్జెట్ ముద్రణ ప్రక్రియ ప్రారంభమైందని అర్థం. ఈ కార్యక్రమం అనంతరం అధికారులు 'లాక్-ఇన్' కాలంలోకి వెళ్తారు. అంటే బడ్జెట్ పూర్తయ్యే వరకు బయట ప్రపంచంతో వారికి సంబంధం ఉండదు

బ్రీఫ్‌కేస్ నుంచి బహీఖాతా వరకు

గతంలో ఆర్థిక మంత్రులు బడ్జెట్ పత్రాలను లెదర్ బ్రీఫ్‌కేస్‌లో పార్లమెంట్‌కు తీసుకువచ్చేవారు. అయితే 2019లో ఆ సాంప్రదాయానికి స్వస్తి పలికి, బహీఖాతాను పరిచయం చేశారు. ఇది ఆధునికతతో పాటు దేశీయ విలువలను ప్రతిబింబించింది నిర్మలా సీతారామన్ రికార్డు ప్రస్తుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే వరుసగా అనేక బడ్జెట్లు ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారు యూనియన్ బడ్జెట్-2026 కూడా ఆమె చేతుల మీదుగానే రానుంది. ఇక, భారతదేశ చరిత్రలో అత్యంత పొడవైన బడ్జెట్ ప్రసంగం చేసిన రికార్డు నిర్మలా సీతారామన్ పేరిట ఉంది. 2020లో ఆమె 2 గంటల 42 నిమిషాల పాటు ప్రసంగించారు. అంతకు ముందు, 2019లో సీతారామన్ 2 గంటల 17 నిమిషాల పాటు బడ్జెట్ ప్రసంగం చేశారు. ఆ తర్వాతి సంవత్సరం తన రికార్డును తానే బద్దలుకొట్టారు.

# అండమాన్‌నికోబార్‌కు ‘అజాద్ హిందూ’ పేరు పెట్టాలి....

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత....




హైదరాబాద్/**ఆకాంక్ష జనవరి 24:** నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యాలయం, బంజారాహిల్స్‌లో ఘనంగా నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొని నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నేతలు, తెలంగాణ జాగృతి నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నేతలతో కవిత సమావేశమయ్యారు. అండమాన్‌నికోబార్ దీవులకు ‘అజాద్ హిందూ’ పేరు పెట్టాలన్న ఫార్వర్డ్ బ్లాక్ డిమాండ్‌కు తెలంగాణ జాగృతి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ అంశానికి సంబంధించి ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ కూడా రాసినట్లు కవిత వెల్లడించారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, సుభాష్ చంద్రబోస్ గారి జయంతి రోజున ఆయనకు నివాళులు అర్పించడం గర్వకారణమన్నారు. ఎప్పటి నుంచో అండమాన్‌నికోబార్ దీవుల పేరు మార్చాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ డిమాండ్ చేస్తోందని, అండమాన్‌కు ‘అజాద్ హిందూ’ పేరు పెట్టాలన్న వారి విజ్ఞప్తికి జాగృతి పూర్తిగా మద్దతుగా నిలుస్తోందని తెలిపారు. ఈ నెల 26న ట్విట్టర్‌లో హ్యాష్ ట్యాగ్ ఉద్యమం చేపడతామని, తమ నెట్‌వర్క్ ద్వారా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఈ డిమాండ్ వినిపించేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. నిజానికి అండమాన్‌నికోబార్ దీవులకు బ్రిటీష్‌లు పెట్టిన పేర్లను కొనసాగించడం సరైంది కాదని కవిత వ్యాఖ్యానించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన నేతాజీ వంటి మహానాయకుడి పేరును ఆ దీవులకు పెట్టడం దేశ గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జనవరి 26న నేతాజీ గౌరవార్థం అండమాన్ పేరు మారుస్తుందని తాము ఆశిస్తున్నామని చెప్పారు.నేతాజీ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని కవిత అన్నారు. స్వాతంత్రం కావాలంటే అది ఇస్తే రాదు, తీసుకోవాలి” అన్న ఆయన మాటలు నేటికీ ప్రాసంగికమని తెలిపారు. యువత రక్తం ఇస్తే తాను స్వాతంత్రాన్ని తెస్తానని నేతాజీ చెప్పారని గుర్తు చేశారు. ఉన్నత కుటుంబంలో పుట్టి, ఐఏఎస్‌లో నాలుగో ర్యాంక్ సాధించినప్పటికీ బ్రిటీష్ ప్రభుత్వానికి పని చేయలేనని ఐఏఎస్ పదవిని వదిలేసి అజాద్ హిందూ ఫౌజ్‌ను ఏర్పాటు చేసిన గొప్ప నాయకుడన్నారు. దేశం నుంచి వెళ్లగొట్టిన తర్వాత కూడా విదేశాల్లో ఉండి స్వాతంత్ర పోరాటాన్ని కొనసాగించారని, దౌత్యపరంగానూ ప్రపంచ మద్దతును కూడగట్టారని వివరించారు.మహిళల పాత్రపై మాట్లాడుతూ, నేటికీ మహిళల రిజర్వేషన్ల కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి ఉందని, కానీ ఆ రోజుల్లోనే ఝాన్సీ లక్ష్మీభాయ్ పేరుతో మహిళలకు సైన్యంలో అవకాశం ఇచ్చిన నేతాజీ దూరదృష్టి గల నాయకుడని కవిత కొనియాడారు. మహిళలకు ఆయుధాలు ఇచ్చి పోరాటానికి ప్రోత్సహించిన ధైర్యం ఆయనలో ఉందన్నారు.నేతాజీ గారు దేశం గర్వించదగ్గ సంపదని, ఆయన స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కవిత పిలుపునిచ్చారు. స్వాతంత్రానికి ముందు బ్రిటీష్ ప్రధాని అట్లీ సైతం అజాద్ హిందూ ఫౌజ్ బ్రిటీష్ ప్రభుత్వాన్ని భయపెట్టిందని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి మహానాయకుడి లెగసీని కాపాడుకునేందుకు అండమాన్‌నికోబార్ దీవులకు ‘అజాద్ హిందూ’ పేరు పెట్టాల్సిందేనని ఆమె స్పష్టం చేశారు.గతంలో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో హైదరాబాద్ పేరును భాగ్యనగరం చేస్తామని బీజేపీ చెప్పి రాజకీయ ప్రయోజనాలకే పరిమితమైందని కవిత విమర్శించారు. నేతాజీ వంటి నాయకుల గౌరవం రాజకీయ ప్రయోజనాలకు అతీతమని, దేశం మొత్తంగా గౌరవించేలా నిర్ణయాలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# కాపర్ వైర్, వరి వడ్ల దొంగతనం కేసు ఛేదన...

### నేరం ఛేదించి రూ.62,500 దొంగ సొత్తు రికవరీ చేసిన జగిత్యాల పోలీసులు...

### చందుర్తి మండలం సనుగుల గ్రామానికి చెందిన ఐదుగురు మహిళల అరెస్ట్..

హస్నాబాద్/**ఆకాంక్ష జనవరి 24:** జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కాపర్ వైర్ మరియు వరి వడ్ల దొంగతనం కేసును పోలీసులు అతి తక్కువ సమయంలో ఛేదించి నిందితులను అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో దొంగిలించిన సొత్తును అమ్మగా వచ్చిన మొత్తం రూ.62,500 నగదును రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు.హస్నాబాద్ గ్రామానికి చెందిన బత్తుల శ్రీధర్ (తండ్రి: వెంకట్ రెడ్డి) జనవరి 23, 2026న పోలీసులకు ఫిర్యాదు చేశారు. హస్నాబాద్ శివారులో ఉన్న తన వ్యవసాయ బావి వద్ద మోటారుకు బిగించి ఉన్న కాపర్ వైర్‌ను గుర్తుతెలియని దొంగలు కత్తిరించి ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించగా, సమీప రైతుల పొలాల్లోని కరెంట్ మోటార్ల నుండి కూడా కాపర్ వైర్ దొంగతనం జరిగినట్లు గుర్తించారు. అదేవిధంగా వరి కల్లాల్లో పోసిన సుమారు 10 క్వింటాళ్ల వడ్లను కూడా దొంగలు ఎత్తుకెళ్లినట్లు నిర్ధారించారు. ఈ దొంగతనాల విలువ మొత్తం రూ.62,500గా అంచనా వేయబడింది.ఈ ఫిర్యాదు ఆధారంగా జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. ఎన్. సధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా జగిత్యాల పట్టణంలోని చిన్న కెనాల్ ఏరియా, కరీంనగర్ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.విచారణలో వారు హస్నాబాద్ పరిధిలో జరిగిన కాపర్ వైర్ మరియు వరి వడ్ల దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని పోలీసులు వెల్లడించారు.అరెస్ట్ అయిన నిందితులు బత్తుల సారవ్వ (37), భర్త జానయ్య, గంట రాజవ్వ భర్త లచ్చయ్య, బత్తుల సమ్మవ్వ తండ్రి అంకుష్, బత్తుల మంజుల భర్త అంజయ్య, బత్తుల సారవ్వ (27) భర్త జానయ్యగా గుర్తించారు. వీరంతా రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం సనుగుల గ్రామానికి చెందినవారిగా పోలీసులు తెలిపారు. బిక్షాటన నిమిత్తం జగిత్యాల పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో నివాసం ఉంటూ ఈ దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించారు.నిందితుల వద్ద నుండి దొంగిలించిన సొత్తును అమ్మగా వచ్చిన రూ.62,500 నగదును పూర్తిగా రికవరీ చేసి ఐదుగురినీ అరెస్ట్ చేసినట్లు జగిత్యాల టౌన్ ఇన్స్పెక్టర్ పి. కరుణాకర్ తెలిపారు. ఈ కేసును వేగంగా ఛేదించి దొంగ సొత్తును స్వాధీనం చేసుకున్నందుకు గాను జగిత్యాల ఎస్డిపిఓ డి. రఘు చందర్, టౌన్ ఇన్స్పెక్టర్ పి. కరుణాకర్, ఎస్.ఐ. ఎన్. సధాకర్‌తో పాటు పోలీస్ సిబ్బందిని అభినందించారు.

# ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుల సేవలకు అద్దం....

### SETA క్యాలెండర్ ఆవిష్కరణ జిల్లా కేంద్రం...




ఆదిలాబాద్/**ఆకాంక్ష జనవరి 24:** స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ (ూజుూ) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను అదనపు జిల్లా కలెక్టర్ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) క్యాంపు కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. ప్రత్యేక విద్యా రంగంలో సేవలందిస్తున్న ఉపాధ్యాయుల కృషిని ప్రతిబింబించేలా ఈ క్యాలెండర్‌ను రూపొందించినట్లు ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఎంఓ తిరుపతి సుజాత ఖాన్, ూజుూ రాష్ట్ర కోశాధికారి గడుగు మహేందర్, జిల్లా అధ్యక్షులు వెంకట్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొని క్యాలెండర్ ప్రత్యేకతలను వివరించారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు సమాజానికి ఆదర్శమని వారు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రత్యేక ఉపాధ్యాయులు మల్లీశ్వరి, సంధ్యారాణి, శ్రీనివాస్,హనుమాన్, సుజిత్, ప్రశాంత్, సంజీవ్ తదితరులు కార్యక్రమానికి హాజరై క్యాలెండర్ ఆవిష్కరణను విజయవంతం చేశారు. ఈ క్యాలెండర్ ప్రత్యేక విద్యా రంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రోత్సాహాన్ని కలిగించడమే కాకుండా వారి సేవలను గుర్తించేలా రూపొందించబడిందని వక్తలు అభిప్రాయపడ్డారు

# రుణం పొందడానికి తెలివైన మార్గం..

# వ్యక్తిగత రుణం జం టాప్-అప్.. ఇందులో ఏది ఉత్తమం!




మీకు వేరే జువీ× అవసరం అయినప్పటికీ, కొత్త లోన్ తీసుకోవడం మంచిది. ఎంపికలను పోల్చకుండా నిర్ణయాలు ఎప్పుడూ తీసుకోకండి. మొదట రెండింటిలోనూ మొత్తం వడ్డీ ఎంత చెల్లించాలో తెలుసుకోండి. మొత్తం వడ్డీ ఎక్కడ తక్కువగా ఉందో ఎంచుకోండి.. ఏదైనా వైద్య బిల్లు, వివాహం, వ్యాపార సమస్య లేదా ఇతర అత్యవసర ఖర్చు అకస్మాత్తుగా తలెత్తినప్పుడు మొదట మనసులోకి వచ్చే ఆలోచన వ్యక్తిగత రుణం. కానీ నిజమైన గందరగోళం ఇక్కడే ప్రారంభమవుతుంది. కొత్త వ్యక్తిగత రుణం తీసుకోవడం మంచిదా లేదా మీ ప్రస్తుత రుణాన్ని తిరిగి చెల్లించడం మంచిదా? నిజానికి ఈ గందరగోళంలో చిక్కుకున్న చాలా మంది తొందరపడి నిర్ణయాలు తీసుకుంటారు. అలాగే తరువాత వడ్డీని చెల్లించాల్సి వస్తుంది. అందువల్ల ఏ ఎంపిక మంచిదో, ఎందుకు మంచిదో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

**కొత్త పర్సనల్ లోన్ జం టాప్-అప్: ఏది ఉత్తమ ఎంపిక?**

**టాప్-అప్ లోన్ అంటే ఏమిటి?**

మీ ప్రస్తుత పర్సనల్ లోన్ ఉన్నప్పుడు మీరు రుణం వాయిదాలు చెల్లిస్తున్న కాలంలో మీకు మళ్ళీ నిధులు అవసరమైనప్పుడు బ్యాంకు కొత్త మొత్తాన్ని పాత రుణ మొత్తానికి జోడిస్తుంది. అంటే మీరు అదే రుణంపై మళ్ళీ రుణం పొందుతారు. దీనిని టాప్-అప్ లోన్ అంటారు. కొత్త రుణం ప్రారంభించకుండానే అదనపు మొత్తం అందుబాటులో ఉంటుంది. మీరు మొదట రూ.5 లక్షల రుణం తీసుకున్నారని అనుకుందాం.. ఇప్పటివరకు రూ.2 లక్షల వరకు చెల్లింపులు చేశారు. జువీ×లు సకాలంలో చెల్లిస్తున్నారు. అలాంటప్పుడు మీ మంచి రికార్డు చూసిన తర్వాత బ్యాంక్ మిమ్మల్ని విశ్వసిస్తుంది. అందువల్ల ఇది అదే రుణంపై అదనపు నిధులను ఇస్తుంది. మీరు రూ.1.5ఉ2 లక్షల వరకు టాప్-అప్ పొందవచ్చని అనుకుందాం.

### టాప్-అప్ ఎందుకు ప్రత్యేకమైనది?

వడ్డీ రేటు సాధారణంగా కొత్త రుణం కంటే తక్కువగా ఉంటుంది. బ్యాంకు వద్ద ఇప్పటికే అన్ని పత్రాలు ఉన్నాయి కాబట్టి మళ్ళీ పత్రాలను సమర్పించడంలో ఎటువంటి ఇబ్బంది ఉండదు. ప్రాసెసింగ్ ఫీజులు చాలా తక్కువగా ఉంటాయి లేదా కొన్నిసార్లు జీరో ఫీజు కూడా ఉంటుంది. ఇది త్వరిత ఆమోదం, అంటే డబ్బు త్వరగా అందుతుంది.

### కొత్త పర్సనల్ లోన్ ఎప్పుడు తీసుకోవాలి?

ప్రతిసారీ టాప్-అప్ తీసుకోవడం ప్రయోజనకరం కాదు. కొన్ని సందర్భాల్లో కొత్త రుణం తీసుకోవడం మంచి నిర్ణయం. నిబంధనలు, వడ్డీ మీకు సరిగ్గా ఉంటేనే కొత్త రుణాన్ని ఎంచుకోండి. కొన్ని సందర్భాలలో మీ బ్యాంక్ టాప్-అప్ పై అధిక వడ్డీని వసూలు చేస్తుండవచ్చు. మీరు మరొక బ్యాంకు నుండి తక్కువ వడ్డీ రేటుకు మెరుగైన ఆఫర్‌ను పొందుతున్నారు. అలాంటి సమయంలో కొత్తగా వ్యక్తిగత రుణం తీసుకోవాలి.

**వందే భారత్ రైలు తయారీకి ఎంత ఖర్చు అవుతుందో తెలిస్తే షాకవుతారు!**

### ఈ తప్పు జరగకుండా జాగ్రత్త వహించండి:

టాప్-అప్‌లో బ్యాంకులు తరచుగా పాత, కొత్త రుణాలను కలిపి కొత్త జువీ×ని సృష్టిస్తాయి. ఇది పూర్తి వడ్డీని పునఃప్రారంభించవచ్చు. మొత్తం రుణ కాలపరిమితి పెరుగుతుంది. మొత్తం వడ్డీని గతంలో కంటే ఎక్కువగా చెల్లించాల్సి రావచ్చు. టాప్-అప్ తీసుకునే ముందు ఖర్చును అర్థం చేసుకోండి. టాప్-అప్ తీసుకునే ముందు జువీ× కాలిక్యులేటర్‌లో మొత్తం వడ్డీని తనిఖీ చేయండి. తక్కువ జువీ× చూసి నిర్ణయం తీసుకోకండి. మొత్తం ఎంత వడ్డీ ఉత్పత్తి అవుతుందో అర్థం చేసుకోండి. అప్పుడే మీరు రుణాన్ని తెలివిగా ఎంచుకోగలుగుతారు.

### అన్నింటికంటే ఏది ఉత్తమమైనది?

తక్కువ వడ్డీ ం తక్షణ డబ్బు ం వేగవంతమైన ప్రాసెసింగ్ = మెరుగైన టాప్-అప్ లోన్. మీ బ్యాంక్ ఈ ప్రయోజనాలను అందిస్తే టాప్-అప్ ఎంచుకోండి. మరొక బ్యాంకులో వడ్డీ రేటు చాలా తక్కువగా ఉంటే కొత్త రుణం సరైనదే. మీకు వేరే జువీ× అవసరం అయినప్పటికీ, కొత్త లోన్ తీసుకోవడం మంచిది. ఎంపికలను పోల్చకుండా నిర్ణయాలు ఎప్పుడూ తీసుకోకండి. మొదట రెండింటిలోనూ మొత్తం వడ్డీ ఎంత చెల్లించాలో తెలుసుకోండి. మొత్తం వడ్డీ ఎక్కడ తక్కువగా ఉందో ఎంచుకోండి. ఇందులోని సమాచారం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన వివరాల ప్రకారం అందిస్తున్నాము. రుణాలు తీసుకునే ముందు ఆర్థిక సలహాదారు నుండి సరైన సలహా తీసుకోండి)

# భారతదేశాన్ని తక్కువ అంచనా వేయకండి..

# బ్రిటన్ ఉ జపాన్‌లను అధిగమిస్తోంది.. త్వరలోనే..!

భారతదేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ బ్రోకరేజ్ సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ 2027 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉంటుందని అంచనా వేసింది. పెట్టుబడి బ్యాంకు భారతదేశ వాస్తవ +ణూ వృద్ధి 2027 ఆర్థిక సంవత్సరంలో 6.8 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ బ్రోకరేజ్ సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ 2027 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉంటుందని అంచనా వేసింది. పెట్టుబడి బ్యాంకు భారతదేశ వాస్తవ +ణూ వృద్ధి 2027 ఆర్థిక సంవత్సరంలో 6.8 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. ఇది 2026 ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతం కంటే కొంచెం తక్కువగా ఉంది. డిమాండ్‌కు మద్దతుగా నిర్ణయాత్మక విధాన మార్పు వృద్ధిని పెంచుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ పేర్కొన్నారు. 2025లో భారతదేశం ఆదాయపు పన్ను ఉపశమనాన్ని అందించింది. వస్తువులు, సేవల పన్ను (+ూు)ని హేతుబద్ధీకరించింది. అన్ని రకాల పన్నులను సరళీకృతం చేసింది.. ద్రవ్యతను పెంచడంపై దృష్టి పెట్టింది. వినియోగానికి మద్దతుగా =దీ× రెపో రేటును మొత్తం 125 బేసిస్ పాయింట్లు తగ్గించింది. 2021లో భారతదేశం ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ఈ సమయంలో భారతదేశం బ్రిటన్‌ను అధిగమించి ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. అప్పటి నుండి భారతదేశం వేగం కొనసాగుతోంది. గత 25 సంవత్సరాలుగా భారతదేశం 6.4 శాతం, చైనా 8.0 శాతం కంటే వెనుకబడి ఉన్నప్పటికీ, ఇటీవలి సంవత్సరాలలో ఈ ధోరణి మారిపోయింది. అందుకే భారతదేశం గత సంవత్సరం జపాన్‌ను అధిగమించి ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. గత శుక్రవారం (జనవరి 02, 2026), ూదీ× మ్యూచువల్ ఫండ్ భారతదేశ నామమాత్రపు +ణూ వృద్ధి రేటు 2026-27 ఆర్థిక సంవత్సరంలో సుమారు 11 శాతానికి, వాస్తవ +ణూ వృద్ధి సుమారు 7.2 శాతానికి పెరుగుతుందని అంచనా వేసింది. ప్రభుత్వ విధాన మార్పులు, మెరుగైన, ఖరీదైన ఉత్పత్తులను కొనుగోలు చేయాలనే ప్రజల ధోరణి పెరుగుతున్న కారణంగా రాబోయే సంవత్సరాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు అనుకూలంగా ఉంటాయని ూదీ× మ్యూచువల్ ఫండ్ నివేదిక పేర్కొంది. అయితే, ఈ కాలంలో ప్రపంచ మాంద్యం, భౌగోళిక రాజకీయాలు ఆర్థిక వ్యవస్థకు సవాలుగా మారవచ్చు. ఇండియన్ రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఇండ్-రా) మంగళవారం నాడు భారత ఆర్థిక వ్యవస్థ 2026-27 ఆర్థిక సంవత్సరంలో (2027 ఆర్థిక సంవత్సరం) 6.9 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేసింది. అయితే, ఇది 2026 ఆర్థిక సంవత్సరానికి అంచనా వేసిన 7.4 శాతం వృద్ధి రేటు కంటే తక్కువ.

# కేవలం రూ.75 వేల పెట్టుబడితో ఏడాదికి

# రూ.6 లక్షల ఆదాయం.. అద్భుతమైన బిజినెస్ ఐడియా!



మీరు నెల వారీగా ఏడాదికి పెద్ద మొత్తంలో ఆదాయం పొందేందుకు రకరకాల మార్గాలు ఉన్నాయి. తక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టి ఎక్కువ లాభం పొందే వ్యాపారాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి వ్యాపారాలను ఎంచుకుని నడిపించడంలో మీరు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. దీంతో మీరు నెల వారీగా మంచి రాబడి పొందవచ్చు.. ప్రజలు తరచుగా వారి ఇళ్లలో నెలకు లేదా సంవత్సరానికి ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే ఉపయోగించిన చాలా వస్తువులు పడి ఉంటాయి. ఈ ఉపయోగించని వస్తువులను ఉపయోగించి మీరు గొప్ప వ్యాపారాన్ని ప్రారంభించవచ్చు. కెమెరాలు, డ్రోన్లు, ప్రొజెక్టర్లు, డ్రిల్ మెషీన్లు, కార్లు లేదా ఇతర వాహనాలు వంటి ఆస్తులను లీజుకు తీసుకోవడం ద్వారా మీరు ఆస్తి బ్రోకరింగ్ సేవను అమలు చేయవచ్చు. మీరు యజమాని- కస్టమర్ మధ్య బ్రోకర్‌గా వ్యవహరిస్తారు. అవసరమైన వారికి వస్తువులను డెలివరీ చేస్తారు. అలాగే ప్రతి బుకింగ్‌పై మంచి కమీషన్ పొందుతారు. ఈ మోడల్ ప్రత్యేకమైనది. ఎందుకంటే యజమాని అదనపు ఆదాయాన్ని సంపాదిస్తాడు. కస్టమర్ ఖరీదైన వస్తువును కొనుగోలు చేయడానికి బదులుగా తక్కువ ధరకు అద్దెకు తీసుకునే అవకాశం ఉంది.

**వందే భారత్ రైలు తయారీకి ఎంత ఖర్చు అవుతుందో తెలిస్తే షాకవుతారు!**

**ఎలా ప్రారంభించాలి?**

వస్తువుల జాబితాను రూపొందించండి ఉ మీ చుట్టూ లేదా మీ నెట్‌వర్క్‌లో ఖరీదైన వస్తువులు ఉన్న వ్యక్తులను కనుగొనండి. ధృవీకరణ, భద్రత ఉ మీ వస్తువుల భద్రతను నిర్ధారించడానికి అద్దె ఒప్పందం, ×ణ రుజువు అమలులో ఉన్నాయని నిర్ధారించుకోండి. వస్తువు తిరిగి ఇవ్వకపోతే ఏదైనా నష్టం లేదా నష్టాన్ని కవర్ చేయడానికి కస్టమర్ భద్రతా డిపాజిట్ పొందారని నిర్ధారించుకోండి. మార్కెటింగ్ ఉ సోషల్ మీడియా, మీ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా అవసరమైన కస్టమర్‌లను చేరుకోండి. కమీషన్లు, చెల్లింపులు ఉ యజమాని, కస్టమర్ మధ్య పారదర్శక చెల్లింపు వ్యవస్థను ఏర్పాటు చేయండి. బుకింగ్ మొత్తం వచ్చిన తర్వాత మీ కమీషన్‌ను తగ్గించి, మిగిలిన మొత్తాన్ని యజమానికి బదిలీ చేయండి.

**కేవలం 75 వేల రూపాయల పెట్టుబడి**

**అవసరం ఖర్చు**

**వెబ్‌సైట్/ యాప్ రూ.20-40 వేలు**

**మార్కెటింగ్, బ్రాండింగ్ రూ.10-15 వేలు**

**ఒప్పంద ముసాయిదా తయారీ రూ.5-10 వేలు**

**కార్యాలయం రూ.0-10 వేలు**

**మొత్తం పెట్టుబడి రూ.35-75 వేల వరకరు**

### అద్దెపై 15 నుండి 25% కమిషన్:

ప్రారంభంలో మీ ఆదాయాలు మీరు సృష్టించే అద్దె వ్యాపారం మొత్తంపై ఆధారపడి ఉంటాయి. మీరు నెలకు అద్దె వ్యాపారంలో రూ.2 లక్షలు సంపాదిస్తే 15 నుండి 25% కమీషన్‌తో మీరు రూ.30,000 నుండి రూ.50,000 వరకు నెలవారీ ఆదాయాన్ని సంపాదించవచ్చు. అంటే మీరు సంవత్సరానికి రూ.6 లక్షల వరకు సంపాదించవచ్చు.

# పీఎం ఆవాస్ యోజన ప్రయోజనం

# ఏంటో తెలుసా? ఎవరు దరఖాస్తు చేసుకోవచ్చు?

కేంద్రంలోని మోడీ సర్కార్ దేశ ప్రజల కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తోంది. రైతులకు, పేదలకు, ఇతర వర్గాల వారికి ఆర్థికంగా సాయం అందించే పథకాలను అమలు చేస్తోంది. అయితే శాశ్వతంగా ఇల్లు లేనివారికి కూడా ఆర్థిక సాయం అందిస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకాన్ని అమలు చేస్తోంది.. కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల కోసం రకరకాల పథకాలను అమలు చేస్తోంది. కేంద్రం అమలు చేస్తున్న పథకాల్లో పీఎం ఆవాస్ యోజన ఒకటి. ఇంకా శాశ్వత ఇల్లు నిర్మించుకోని పట్టణ కుటుంబాలకు శుభవార్త ఉంది. ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 (ూహీూ-ఖ 2.0) కింద ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు ఇల్లు నిర్మించడానికి, కొనడానికి లేదా అద్దెకు తీసుకోవడానికి ఆర్థిక సహాయం అందిస్తోంది కేంద్రం. ఈ పథకం 2024 నుండి 2029 వరకు ఐదు సంవత్సరాల పాటు అమలులో ఉంటుంది.

### PMAY-U 2.0 ఎవరి కోసం?

ఈ పథకం భారతదేశంలో ఎక్కడా శాశ్వత ఇల్లు లేని కుటుంబాల కోసం. ఆర్థికంగా బలహీన వర్గాలు , తక్కువ ఆదాయ వర్గాలు , మధ్య ఆదాయ వర్గాలు చెందిన పట్టణ కుటుంబాలకు ఈ పథకం ప్రయోజనం చేకూరుస్తుంది. వారి అవసరాలను బట్టి లబ్ధిదారులు కొత్త ఇల్లు నిర్మించుకోవచ్చు. ఇల్లు కొనుగోలు చేయవచ్చు. లేదా అద్దె గృహాలను ఎంచుకోవచ్చు.

### ఆదాయ పరిమితి ఎంత?

ఆర్థికంగా బలహీన వర్గాల వారికి: వార్షిక ఆదాయం రూ. 3 లక్షల వరకు
తక్కువ ఆదాయ వర్గాల వారికి: వార్షిక ఆదాయం రూ. 3 లక్షల నుండి రూ. 6 లక్షల మధ్య.
మధ్య ఆదాయ వర్గాల వారికి: వార్షిక ఆదాయం రూ. 6 లక్షల నుండి రూ. 9 లక్షల మధ్య

### ఎవరు దరఖాస్తు చేసుకోలేరు?

గత 20 సంవత్సరాలలో ఏదైనా కేంద్ర, రాష్ట్ర లేదా స్థానిక సంస్థల గృహనిర్మాణ పథకం నుండి ప్రయోజనం పొందిన వారు PMAY-U 2.0 కి అర్హులు కారు. మొదటిసారి ఇంటి యజమానులకు మాత్రమే సహాయం చేరేలా చూడటం దీని లక్ష్యం.

### ఈ పథకాన్ని ఎవరు నడుపుతారు?

PMAY-U 2.0 ను గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అమలు చేస్తుంది.PMAY-U 2.0 పట్టణ కుటుంబాలు తమ ఇంటిని సొంతం చేసుకోవాలనే కలను నెరవేర్చుకోవడానికి ఒక గొప్ప అవకాశం. మీరు అర్హులైతే ఆదాయ పరిమితులు, అర్హత ప్రమాణాలను జాగ్రత్తగా సమీక్షించి, సకాలంలో దరఖాస్తు చేసుకోండి

## మేడారం సమ్మక్క సారలమ్మ అమ్మవారిని పొన్నం ప్రభాకర్...



మేడారం/**ఆకాంక్ష జనవరి 24:** ములుగు జిల్లాలో మేడారం సమ్మక్క సారలమ్మ అమ్మవారిని పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. అమ్మవారికి నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మేడారం జాతర కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్ స్టేషన్ ను ప్రారంభించారు. అమ్మవారి దివ్య ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆరోగ్యం, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించడం జరిగింది. లక్షలాది భక్తుల నమ్మకానికి ప్రతీకగా నిలిచిన సమ్మక్కసారలమ్మ తల్లి కృపతో ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగు నిండాలని ఆకాంక్షించారు.

## సారపాక లో మూడు కేజీల గంజాయి పట్టివేత ముగ్గురు అరెస్ట్...



భద్రాచలం/**ఆకాంక్ష జనవరి 24:** భూర్గంపాడు మండలం సారపాక ఏరియా లో పోలీస్ తనిఖీలు చేపట్టగా మూడు కేజీల గంజాయి తో పట్టుబడ్డ ముగ్గురు వ్యక్తులు, వారిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేయడం జరిగింది, వీరు ఖమ్మం కు చెందిన వారు గా గుర్తించారు, ఒక ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నా ఎస్ ఐ నాగ బిక్షం మరియు సిబ్బంది. ఇంత నిఘా పెట్టి వాహన తనిఖీలు చేస్తున్న కూడా గంజాయి రవాణా జరుగుతుంది అని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఇలాంటివి మళ్ళీ జరగవు అని, గంజాయి వలన యువత తప్పుదారి పడుతున్నారని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

## అగ్నిప్రమాద బాధితుడి ఇంటిని పరామర్శించిన సర్పంచ్ సతీష్...



ఓదెల/**ఆకాంక్ష జనవరి 24:** పెద్దపల్లి జిల్లా ఓదెల గ్రామంలో శుక్రవారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో జరిగిన అగ్నిప్రమాద ఘటన గ్రామస్థులను కలచివేసింది. గ్రామానికి చెందిన ఎంబాడి సతీష్ నివసిస్తున్న నివాస గృహం ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి కావడంతో ఇల్లు పాక్షికంగా దగ్ధమైంది. ఈ ఘటనలో గృహోపకరణాలు, ఇంటి సామాగ్రి నష్టపోయినట్టు సమాచారం.సమాచారం అందిన వెంటనే ఓదెల గ్రామ సర్పంచ్ సతీష్ సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిప్రమాదానికి గురైన ఇంటిని పరిశీలించారు. బాధితుడిని పరామర్శించి, ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ విషయాన్ని ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తగిన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితునికి అవసరమైన సహాయం అందజేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చంద్రారెడ్డి, వార్డు సభ్యులు చింతం తిరుపతి, దూలం సదానందం, గొపతి ప్రవీణ్, ఐలయ్య, చేరాలు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### భారత్ ఎగుమతులపై సుంకాల్ని

## అమెరికా తగ్గించే యోచనలో అమెరికా



న్యూఢిల్లీ/ **ఆకాంక్ష జనవరి 24:** భారత్ ఎగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ఈ సుంకాల్ని అమెరికా తగ్గించే యోచనలో ఉంది. దీనికి కారణం.. రష్యా నుంచి ఇటీవల చమురు కొనుగోళ్లను ఇండియా తగ్గించడమే. రష్యా నుంచి చమురు దిగుమతుల్ని ఇండియా తగ్గించిన నేపథ్యంలో టారిఫ్ లు 25 శాతం నుంచి 50 శాతం వరకు తగ్గించే ఆలోచన ఉందని అమెరికా ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెసెంట్ అన్నారు.ఈ అంశాన్ని ట్రంప్ నాయకత్వం పరిశీలిస్తోందన్నారు. అమెరికాలోని ఒక మీడియా సంస్థతో స్కాట్ మాట్లాడారు. ఆయిల్ దిగుమతుల్ని ఇండియా తగ్గించుకోవడం హర్షించదగిన చర్య అన్నారు. భారత్.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతోనే ట్రంప్ మనపై టారిఫ్ లు పెంచాడు. అలాగే, రెండు దేశాల మధ్య ఉన్న వాణిజ్య వ్యత్యాసాల కారణంగా కూడా టారిఫ్ లు పెంచాడు. రష్యా ఆయిల్ కొనడం ఇండియా తగ్గిస్తేనే టారిఫ్లు తగ్గిస్తామని ట్రంప్ హెచ్చరించాడు. అయితే, వివిధ కారణాల వల్ల ఇటీవల ఇండియా రష్యా నుంచి చమురు కొనుగోలును స్వల్పంగా తగ్గించింది. దీంతో తమ ఒత్తిడి ఫలించిందని, టారిఫ్ ల పెంపు మంత్రం పనిచేసిందని అమెరికా అంటోంది.టారిఫ్లు ప్రస్తుతం అమలవుతున్నాయని, కానీ, వాటిని తగ్గించేందుకు మార్గం దొరికిందని స్కాట్ అన్నారు. మరోవైపు యూరోపియన్ యూనియన్ (ఈయూ) మాత్రం ఇండియాపై టారిఫ్లు విధించకపోవడాన్ని కూడా ఆయన తప్పుబట్టారు. ఇండియాతో భారీ ట్రేడ్ డీల్ కుదుర్చుకునేందుకు ఈయూ ప్రయత్నించడం వల్లే టారిఫ్లు లేవని స్కాట్ అన్నారు.

## పోస్టల్ శాఖలో 28,740 ఉద్యోగాలు...

### టెన్త్ మార్కుల ఆధారంగానే ఎంపిక... పరీక్ష లేదు...!




హైదరాబాద్/**ఆకాంక్ష జనవరి 24:** పోస్టల్ శాఖలో 28,740 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు.టెన్త్ మార్కుల ఆధారంగానే ఎంపిక... పరీక్ష లేదు...!మొత్తం ఖాళీలు: 28,740 (అంచనా)తెలంగాణ: 519 పోస్టులుఆంధ్రప్రదేశ్: 1,215 పోస్టులుపోస్టుల పేర్లు: గ్రామీణ డాక్ సేవక్ , బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ (ధీపీ), అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ .ఎంపిక విధానం: ఎటువంటి రాత పరీక్ష ఉండదు. అభ్యర్థులు పదో తరగతిలో సాధించిన మార్కుల (మెరిట్) ఆధారంగా ఎంపిక చేస్తారు.విద్యార్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.వయోపరిమితి: అభ్యర్థుల వయస్సు 18 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి. (నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వయో సడలింపు ఉంటుంది).నోటిఫికేషన్ & దరఖాస్తు ప్రారంభం: జనవరి 31, 2026.దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 14, 2026.మెరిట్ లిస్ట్ విడుదల: ఫిబ్రవరి 28, 2026.ధీపీ: రూ. 12,000/- నుంచి రూ. 29,380/- వరకు రూ. 10,000/- నుండి రూ. 24,470/- వరకు.జనరల్/ఓబీసీ అభ్యర్థులకు: రూ. 100/-ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/మహిళలకు: ఫీజు లేదు.ఆసక్తి గల అభ్యర్థులు జనవరి 31 నుంచి అధికారిక వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష లేకుండా ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు ఇది ఒక సువర్ణావకాశం

## నగరిలో టిడిపి చేసింది శూన్యం మాజీ ఎంఎల్ఎ రోజా




తిరుపతి **ఆకాంక్ష జనవరి 24:** నగరిలో టిడిపి ఎంఎల్ఎ గాలి భాను ప్రకాశ్ చేసింది శూన్యమని వైసిపి నేత, మాజీ ఎంఎల్ఎ రోజా విమర్శించారు. నగరిలో చంద్రబాబు పర్యటిస్తుండడంతో ఆమె మీడియాతో మాట్లాడారు. కల్యాణమండపం, సబ్ స్టేషన్, పాలిటెక్నిక్ కాలేజీ, పార్కు, షాదీ మహల్ అన్నీ తామే కట్టామన్నారు. పేదవారికి ఇళ్లతో సహా తామే ఇచ్చామని, చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్నారు కాబట్టి టెక్స్టైల్ పార్క్ పెడతామని టిడిపి నేతలు చెబుతున్నారని, సిఎం చంద్రబాబు నాయుడు అబద్ధాలు వినలేక ప్రజలు పారిపోయారని, నగరి నియోజకవర్గానికి ఉపయోగపడేది టిడిపి చెప్పినదాంట్లో ఒక్కటి లేదన్నారు. నగరి టిడిపికి కంచుకోట అని, సూపర్ సిక్స్ ప్రకటిస్తే అసాధ్యం అన్నారని, సూపర్ సిక్స్లను సూపర్ హిట్గా అమలు చేసి చూపించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పెన్షన్లు, తల్లికి వందనం సహా అన్ని పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఐదేళ్లలో ఏపిని నంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధి చేస్తామని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

## నాంపల్లిలో ఫర్నిచర్ షాపులో అగ్ని ప్రమాదం...

### ఆ భవనంలో తల్లి, ఇద్దరు పిల్లలు ?....



హైదరాబాద్ **ఆకాంక్ష జనవరి 24:** హైదరాబాద్లోని నాంపల్లిలో ఓ ఫర్నిచర్ షాపులో అగ్ని ప్రమాదం జరిగింది. నాలుగు అంతస్తుల కలిగిన భవనంలోని బచ్చా క్యాజిల్ ఫర్నిచర్ షాపులో మంటలో చెలరేగాయి. స్థానికుల సమాచార మేరకు అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు. మంటల్లో తల్లి, ఇద్దరు పిల్లలు చిక్కుకున్నట్టు సమాచారం. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడుతుండడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అగ్ని ప్రమాదం జరిగిన భవనంలోకి రోబోను పంపి అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఆ భవనంలో తల్లి, ఇద్దరు పిల్లలు ఉన్నట్టు సమాచారం. పోలీసులు, హైడ్రా, విపత్తు, జిహెచ్ఎంసి సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. భవనం చుట్టూ పొగ అలుముకోవడంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

## శాఖలవారీగా బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ ప్రారంభం...



హైదరాబాద్**ఆకాంక్ష జనవరి 24:** శాఖల వారీగా బడ్జెట్ సన్నాహక సమావేశాలు మొదలు కానున్నాయి. ఈ సమావేశాలకు ఆయా శాఖ ల మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులతో ఉ పముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క భేటీ కానున్నారు. ప్రస్తుతం శాఖలవారీగా బడ్జెట్ రూపకల్ప న ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే ప్రభుత్వ శాఖల ప్రగతి పద్దు, నిర్వహణ పద్దుకు సంబంధించి అంచనాలను ప్రాథమికంగా తయారు చేసింది. ఈ అంచనాలపై సచివాలయంలో రాష్ట్ర బడ్జెట్ 2026 సన్నాహక సమావేశాలు జరగనున్నాయి. సంబంధిత మంత్రులతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, శాఖాధిపతులు పాల్గొననున్నారు. ఫిబ్రవరి 5 వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. రోజుకు రెండు సెషన్లలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంటకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు సమావేశాలు సాగుతాయి. ఇందుకు సంబంధించి భట్టి ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల వారీగా ఖరారు చేసి న సమీక్షల షెడ్యూల్ను శాఖలకు స్పష్టం చేశారు.పూర్తిస్థాయి బడ్జెట్ రూపకల్పనలో భాగంగా ఆర్థిక శాఖ ఇప్పటికే అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలు కోరారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి సంబంధించి ఆయా శాఖల పనితీరు సూచికల ఆధారంగా నిర్దేశించిన లక్ష్యాల వివరాలు ఇవ్వాలని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. బడ్జెట్ సన్నాహక సమావేశాల్లో ప్రభుత్వ శాఖలు రూపొందించిన అంచనాల ఆధారంగా చర్చిస్తారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు, డిమాండ్కు అనుగుణంగా కేటాయింపులకు ప్రాధాన్యం ఇస్తారు. దీంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలకు అనుగుణంగా కొత్తగా అమలు చేయాల్సిన పథకాలపైనా చర్చించనున్నారు. పాత పథకాలకు బడ్జెట్ డిమాండ్తో పాటు కొత్త పథకాలకు బడ్జెట్పై అవసరాలపై అంచనాకు రానున్నారు. పురపాలన, పట్టణాభివృద్ధి శాఖతోపాటు సాధారణ పరిపాలన విభాగం, హోమ్, లా అండ్ ఆర్డర్, న్యాయ తదితర శాఖలు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి పర్యవేక్షణలో కొనసాగుతుండడంతో ఆయా సమావేశాలకు సీఎం అధ్యక్షత వహిస్తారు. సమీక్షల అనంతరం కేంద్ర బడ్జెట్ ఆధారంగా రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనల్లో మార్పులు చేస్తారు.అనంతరం బడ్జెట్ సమావేశాలు : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ప్రభుత్వం ఫిబ్రవరి చివరి వారంలో నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి రెండు లేదా మూడో వారంలో మున్సిపల్ ఎన్నికలూ జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలు ముగిసిన తర్వాత ఫిబ్రవరి నాలుగో వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ను ప్రవేశ పెట్టనుంది. ఆ బడ్జెట్ ఆధారంగా కేంద్రం నుంచి వివిధ పథకాలు, కార్యక్రమాలకు ఏమేరకు నిధులు వస్తాయన్నది అంచనా వేసి 2026- 27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ను రూపొందించనుంది. ఫిబ్రవరి చివరి వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

## షిరిడీ సాయిబాబా పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించిన రాంచందర్ రావు...

**అనుచిత వ్యాఖ్యలు చేసిన వాఎరు షిరిడీ సాయిబాబా భక్తులందరికీ క్షమాపణ చెప్పాలి...**

**సోషల్ మీడియా మాద్యమాలలో ఉన్న సంబంధిత వీడియోలను తక్షణం ఉపసంహరించుకోవాలి...**



హైదరాబాద్/**ఆకాంక్ష జనవరి 24:** ఇటీవల గత కొంతకాలం గా కొంత మంది షిరిడీ సాయిబాబా పై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను మరియు శ్రీ సాయిబాబా భక్తులను కించ పరుస్తూ, దుర్భాషలాడిన విషయాన్ని రెండు తెలుగు రాష్ట్రాలలోని శిరిడీ సాయి భక్త సంఘాల వారు తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు గౌరవనీయులు ఎన్ రాంచందర్ రావు దృష్టికి తీసుక వచ్చారు. వాటిని పరిశీలించిన పిమ్మట అధ్యక్షులు అత్యంత ఆశ్చర్యానికి గురి అయినారు. త మంది షిరిడీ సాయిబాబా పై చేసిన అనుచిత వ్యాఖ్యలన్నిటిని బీజేపీ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని అన్నారు . ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు బీజేపీ పార్టీ విధానాలకు పూర్తి వ్యతిరేకం అని వారు స్పష్టం చేశారు. బిజెపి పార్టీ సమాజంలో ఐక్యతని, మతసామరస్యాన్ని, దేశభక్తిని పెంపొందించే విధంగా పనిచేస్తుంది కానీ, వ్యక్తుల మధ్య ప్రాంతాల మధ్య విభేదాలను ఎప్పటికీ సమర్థించదు అన్నారు.కొంత మంది చేసిన వ్యాఖ్యలను వ్యక్తిగతమైన వ్యాఖ్యలుగా బిజెపి పార్టీ భావిస్తుంది అని కోట్లాది మంది షిరిడీ సాయిబాబా భక్తుల మానో భావాలను కించపరిచే విధంగా కొంత మంది చేస్తున్న వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ షిరిడీ సాయిబాబా భక్తులందరికీ క్షమాపణ చెప్పాలని బిజెపి పార్టీ సూచన చేస్తూ సోషల్ మీడియా మాద్యమాలలో ఉన్న సంబంధిత వీడియోలను తక్షణం ఉపసంహరించుకోవాలని కోరుతున్నాము అని అన్నారు. ఇకపై భవిష్యత్తులో బిజెపి పార్టీలో ఉన్న వారు ఎవరూ భక్తుల హృదయాలను గాయ పరిచే ఇటువంటి వ్యాఖ్యలను చేసి సమాజంలో వివాదలకు తావు ఇవ్వరు అని శ్రీ ఎన్ ర్ఞంచందర్ రావు గారు శ్రీ షిరిడీ సాయి భక్తులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీ సాయిబాబా భక్తులందరి తరఫున తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, ఎన్ రాంచందర్ రావు కి కృతజ్ఞతలు మరియు అభినందనలు షిరిడి సాయి భక్త సమాజాలు తెలిపాయి. ఈ సందర్భంగా అధ్యక్షుల వారికి శ్రీ సాయిబాబా వారి ప్రసాదాన్ని అందచేసి సాయిబాబా శాలువతో సత్కరించారు.

## వీరాంజనేయ భజన మండలికి ప్రథమ బహుమతి...





నాగర్కర్నూల్/**ఆకాంక్ష జనవరి 24:** నాగర్కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి భజన పోటీలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ పోటీల్లో విశేష ప్రతిభను కనబరిచిన వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం చిన్నమందడికి చెందిన వీరాంజనేయ భజన మండలి ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది.వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉదయం నుంచి రాత్రి వరకు సాగిన ఈ పోటీలు భక్తజనులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ప్రఖ్యాతి చెందిన 14 భజన బృందాలు పాల్గొని తమ తమ ప్రత్యేక శైలుల్లో భజన గీతాలు ఆలపిస్తూ పోటీ తత్వాన్ని ప్రదర్శించాయి. రాగం, తానం, పల్లవి సమన్వయంతో హార్మోనియం, తబలా, తాళం నాదాల మధ్య భక్తిరసాన్ని ఉట్టిపడేలా భజన బృందాలు గీతాలు ఆలపించాయి.ఈ పోటీలకు ప్రసిద్ధి చెందిన గురువయ్య ఆచార్యులు, గుడిపల్లి నరసింహారెడ్డి, నామని ముత్యాలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించగా, ఆలయ యాజమాన్యం వారి మార్గదర్శకత్వంలో పోటీలను నిర్వహించింది. ప్రతి భజన మండలి తమదైన శైలిలో భక్తి గీతాలను పాడుతూ ప్రేక్షకులను రంజింపజేయడంతో ఆలయ ప్రాంగణం అంతా భక్తిమయంగా మారింది.పాలెం గ్రామానికి చెందిన భాగిణి కిషోర్ రెడ్డి ఉదారతతో అందించిన ప్రథమ బహుమతిని వీరాంజనేయ భజన మండలికి అందజేశారు. నాగర్కర్నూల్ కాకతీయ హై స్కూల్ వారిచే అందించిన రూ.10,000 ద్వితీయ బహుమతిని పాన్గల్ మండలం మాందాపూర్ గ్రామానికి చెందిన వీరభద్ర భజన మండలి దక్కించుకుంది. న్యూ లిటిల్ రోజెస్ హై స్కూల్ అందించిన రూ.5,000 తృతీయ బహుమతిని పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన పబ్బతి ఆంజనేయ స్వామి భజన మండలి పొందింది. పోటీల్లో పాల్గొన్న ఇతర భజన మండలీలకు కన్సోలేషన్ బహుమతులు అందజేసి అతిథి మర్యాదలతో సత్కరించారు.బహుమతులను ఆలయ చైర్మన్ మనుసాని విష్ణుమూర్తి, గ్రామ సర్పంచ్ బోనాసి రామకృష్ణ, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ గోవింద్ శ్రీనివాసులు అందజేశారు. న్యాయనిర్ణేతలను ఆలయ యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక అధికారి చిలుకూరి రంగారావు, పతంజలి రాష్ట్ర సమితి అధ్యక్షులు వస్పరి శివుడు, గాడి సురేందర్, కొంకలి మధు, సూపర్ బాలస్వామి, గోవిందు జగదీశ్వర్, ఐల రవీందర్ రెడ్డి, పెద్ద కురుమయ్య, బండారు జగదీష్ కుమార్, కుమ్మరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంపై రూల్స్లో మార్పులు చేసిన ప్రభుత్వం..



హైదరాబాద్, **ఆకాంక్ష జనవరి 24:** మహాలక్ష్మి పథకంలో భాగంగా అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై తెలంగాణ ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది. ఇక నుంచి మహిళలు జీరో టికెట్ పొందేందుకు ఆధార్ కార్డు లేదా ఓటర్ కార్డులు లాంటి ప్రభుత్వ గుర్తింపు ధృవీకరణ పత్రాలను చూపించాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకు మహిళల ఆధార్ కార్డులను చెక్ చేసి కండక్టర్లు జీరో టికెట్ జారీ చేస్తున్నారు. అయితే ఆధార్ కార్డుల్లో పాత ఫొటోలు ఉండటంతో మహిళలను గుర్తించడం కండక్టర్లకు కష్టతరంగా మారింది. దీంతో కండక్టర్లు, మహిళల మధ్య వాగ్వాదాలు జరుగుతున్న సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా చోటుచేసుకుంటూనే ఉన్నాయి. దీనికి చెక్ పెట్టి మహిళలు సులభతరంగా బస్సుల్లో ప్రయాణించేందుకు కొత్త విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం మహిళలకు ప్రత్యేక ఐడీ కార్డులను ఇవ్వనుంది. త్వరలో రాష్ట్రంలోని మహిళలందరికీ మహాలక్ష్మి ఐడీ కార్డును పంపిణీ చేయనుంది. మహిళలు బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం పొందేందుకు ఇవి ఒక ఐడీ కార్డులా ఉపయోగపడతాయి. ఈ కార్డులపై మహిళ ఫొటోతో పాటు పేరు, గ్రామం, మండలం, జిల్లా వంటి అడ్రస్ వివరాలు పొందుపర్చి ఉంటాయి. అలాగే ఈ స్మార్ట్ కార్డులపై క్యూఆర్ కోడ్తో పాటు అత్యాధునిక చిప్ ఉంటుంది. కండక్టర్ల వద్ద ఉండే మెషిన్ స్మార్ట్ కార్డులపై ఉండే చిప్ను స్కాన్ చేయగానే ప్రయాణ వివరాలు నమోదవుతాయి. దీని వల్ల మహిళలు ఆధార్ కార్డును చూపించాల్సిన అవసరం లేదు. తమ దగ్గర ఆధార్ కార్డును క్యారీ చేయాల్సిన పని ఉండదు. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా సులువుగా మహిళలు ప్రయాణం చేయవచ్చు. ప్రతీ ఒక్క వ్యక్తికి ఆధార్ ప్రత్యేక నెంబర్ ఉన్నట్లుగానే.. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా ప్రతీ మహిళకు ఒక 16 అంకెల విశిష్ట నెంబర్ను కేటాయిస్తారు. కార్డు ముందు భాగంలో మహిళ ఫొటో, అడ్రస్ వివరాలు ఉంటాయి. ఈ స్మార్ట్ కార్డుల తయారీ ఇప్పటికే ప్రారంభమవ్వగా.. త్వరలో ముద్రణ పూర్తి కానుంది. కార్డుల తయారీ కోసం రూ.75 కోట్ల నిధులను ఆర్టీసీకి ప్రభుత్వం కేటాయించింది. రాష్ట్రంలోని 1.5 కోట్ల మంది మహిళలకు కార్డులు అందించనున్నారు. తొలుత 5 లక్షల కార్డులను పైలట్ ప్రాజెక్ట్ కింద జారీ చేయనుండగా.. ఆ తర్వాత మిగతా లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి అందరి వివరాలు గతంలో సేకరించింది. ఈ వివరాల ఆధారంగా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది.

## సింగరేణి పతనానికి బీఆర్ఎస్దే బాధ్యత....

### ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ ఘాటు వ్యాఖ్యలు...



గోదావరిఖని/**ఆకాంక్ష జనవరి 24:** గోదావరిఖని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రెస్ మీట్లో రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాగూర్ బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సింగరేణి సంస్థను అధోగతి పాలు చేసిన ఘనత నాటి బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, కార్మికులకు జీతాలు కూడా చెల్లించలేని దుస్థితికి నెట్టిన బాధ్యత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్దేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.2014 నుంచి సింగరేణి సంస్థపై జరిగిన అవకతవకలన్నింటిపై ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు చేసి నిజానిజాలు తేల్చుకుందామని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. భూగర్భ గనులను పక్కనపెట్టి రామగుండం పట్టణం నడిబొడ్డున ఉపరితల గనులు ప్రారంభించడం వల్ల ఊరు మొత్తం బొందల గడ్డగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణాన్ని కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీసిందని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధిని ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని రాజ్ ఠాగూర్ ధ్వజమెత్తారు. నియోజక వర్గానికి కొత్త విద్యుత్ పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు తీసుకురావడం జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు రేట్ల పేరుతో రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. సింగరేణి సంస్థను విస్తృత పరుస్తూ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చౌకబారు ఆరోపణలు చేయడం తగదని స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించి రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పతనం ప్రారంభమైందని, అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు తమ రాజకీయ ధోరణి మార్చుకోవాలని, లేనిపక్షంలో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ ప్రెస్ మీట్ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వామివారికి తులాభారం....




నాగర్ కర్నూల్/**ఆకాంక్ష జనవరి 24:** నాగర్ కర్నూలు జిల్లా బిజినపల్లి మండలం పాలెం వెంకన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా భక్తజనులు శనివారం నాడు తులాభారం సమర్పించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులు చిన్నలు పెద్దలు అనే తేడా లేకుండా తమ బరువుకు తగిన విధంగా ఒకవైపు ఉంచి స్వామివారికి మొక్కులు చెల్లించారు. ఈ తమ తల తమ తమ మొక్కులను చెల్లించుకోవడం కోసం భక్తులు పోటీపడ్డారు. త్రాసులో ఒకవైపు చిన్నారుల నుంచి మరోవైపు నిలువెత్తుతూకం బెల్లంతో స్వామి వారి మొక్కు తీర్చుకొని తమ చిన్నారుల భవితవ్యం బాగుండాలని ఆ శ్రీనివాసుడిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త విష్ణుమూర్తి, ఆలయ కార్యనిర్వాహక అధికారి చిలుకూరి రంగారావు,సర్పంచి బోనాసి రామకృష్ణ, ఉప సర్పంచ్ శ్రీనివాసులు, వస్పరి శివుడు జగదీశ్వర్, రవీందర్ రెడ్డి, బాలస్వామి, కాశిరెడ్డి చంద్రారెడ్డి, పెద్ద కుర్మయ్య, కుమ్మరి స్వామి పాల్గొన్నారు.

## నేడే తెలంగాణ మూవీ,టీవీ,డిజిటల్ ఆర్టిస్ట్...

**యూనియన్ జనరల్ బాడీ సమావేశనికి అందరికీ ఆహ్వానం...**

**అధ్యక్షులు రాజశేఖర్....**




హైదరాబాద్,**ఆకాంక్ష జనవరి 24:** తెలంగాణా మూవి,టీవీ అండ్ డిజిటల్ ఆర్టిస్ట్స్ యూనియన్ జనరల్ బాడీ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని తెలంగాణా మూవి,టీవీ అండ్ డిజిటల్ ఆర్టిస్ట్స్ యూనియన్ అధ్యక్షులు రాజశేఖర్ తెలిపారు.శనివారం తెలంగాణా మూవి,టీవీ అండ్ డిజిటల్ ఆర్టిస్ట్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం(సర్వసభ్య సమావేశం) ఈ రోజు మోతినగర్ కమ్యూనిటీ హాల్లో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరుకు జరుగుతుందని ఆయన సూచించారు.ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్,రహమత్ నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డిలు హాజరవుతున్నట్లు సూచించారు.అందుకు యూనియన్ కార్యవర్గ కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరు తమ విధిగా విచ్చేసి యూనియన్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయన తెలిపారు.అంతేకాకుండా సమావేశంలో పలు అంశాలు చర్చిస్తామని అన్నారు.దీంతో సభ్యులందరు తప్పనిసరిగా యూనియన్ సభ్యులను ప్రతి ఒక్కరిని పేరుపేరునా ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగిందని అధ్యక్షులు రాజశేఖర్,జనరల్ సెక్రెటరీ నూకరాజులు సూచించారు.

# విరిగిన విద్యుత్ స్తంభం...

## నీళ్లలో పడి ప్రమాదకరంగా మారిన మెయిన్ వైర్లు...

## అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం....



మహబూబాబాద్/**ఆకాంక్ష జనవరి 24:** మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం రేపోని గ్రామ శివారులో విద్యుత్ ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారులోని పొలాల వద్ద కొద్ది రోజుల క్రితం విద్యుత్ స్తంభం విరిగి కూలిపోవడంతో, కరెంట్ సరఫరా అయ్యే మెయిన్ వైర్లు పొలాల్లో పడి నీళ్లలో తడిచి ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. ఈ మార్గం గుండా నిత్యం రైతులు, కూలీలు వెళ్లాల్సి రావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో జీవిస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా తరచూ విద్యుత్ షాక్‌లకు గురై రైతులు ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు జరుగుతున్నప్పటికీ, విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరి విడిచి పెట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రేపోని గ్రామంలో విరిగిన స్తంభం విషయం గురించి పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు వాపోతున్నారు. మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రమాదం మరింత తీవ్రమవుతోందని, వర్షాకాలంలో నీళ్లలో పడి ఉన్న వైర్లు ప్రాణాంతకంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రాణాలు పోతే తప్ప అధికారులు స్పందించరా అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. గతంలో జరిగిన దుర్ఘటనల నుంచి అయినా పాఠాలు నేర్చుకోకుండా నిర్లక్ష్యం కొనసాగుతుండటం దారుణమని మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి, విరిగిన విద్యుత్ స్తంభాన్ని మరమ్మతు చేసి, మెయిన్ వైర్లను సురక్షితంగా ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగితే పూర్తి బాధ్యత అధికారులదేనని హెచ్చరిస్తున్నారు.

# ఎక్సైజ్ సిబ్బందిపై గంజాయి స్మగ్లర్ల దాడి...

## కానిస్టేబుల్ సౌమ్యకు తీవ్ర గాయాలు..




నిజామాబాద్/**ఆకాంక్ష జనవరి 24:** నిజామాబాద్ జిల్లాలో గంజాయి స్మగ్లర్ల ఆగడాలు మరోసారి వెలుగుచూశాయి. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గంజాయి అక్రమ రవాణాపై తనిఖీలు చేపట్టిన ఎక్సైజ్ సిబ్బందిపై స్మగ్లర్ల ముఠా దాడికి పాల్పడింది. తనిఖీలను తప్పించుకునే ప్రయత్నంలో స్మగ్లర్లు తమ కారుతో ఎక్సైజ్ సిబ్బందిని ఢీకొట్టి అక్కడి నుంచి పరారయ్యారు.ఈ ఘటనలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సౌమ్య తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే సహచరులు ఆమెను నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.కానిస్టేబుల్‌ను ఢీకొట్టి పారిపోయిన స్మగ్లర్లను పోలీసులు వెంటనే వెంబడించి పట్టుకున్నారు. వారి వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు తనిఖీ చేయగా, అందులో రెండు కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. నిందితులు ఇద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.అరెస్టు చేసిన స్మగ్లర్లు నిర్మల్ జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. గంజాయి అక్రమ రవాణాతో పాటు ప్రభుత్వ విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడి చేసిన కేసుగా నమోదు చేసి, నిందితులపై కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.ఈ ఘటనతో జిల్లాలో గంజాయి మాఫియా మళ్లీ చెలరేగుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఎక్సైజ్, పోలీసు శాఖలు మరింత కఠినంగా తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో విషాద ఘటన...

## మార్బుల్ స్టోన్స్‌పై పడిపడి ఇద్దరి మృతి....





మహబూబాబాద్/**ఆకాంక్ష జనవరి 24:** మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ట్రాలీ నుంచి మార్బుల్ స్టోన్స్ దించుతున్న క్రమంలో అవి మీదపడటంతో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు.వివరాల ప్రకారం.. గార్ల మండలం బంగ్లా తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం మార్బుల్ స్టోన్స్‌ను ట్రాలీ ద్వారా తీసుకొచ్చారు. స్టోన్స్‌ను దించుతున్న సమయంలో అకస్మాత్తుగా అవి జారిపడి అక్కడే ఉన్న ఇద్దరిపై పడటంతో ఘోర ప్రమాదం జరిగింది.ఈ ఘటనలో బంగ్లా తండాకు చెందిన బోడ తరుణ్ (25), ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం నెమలిపురికి చెందిన ట్రాలీ డ్రైవర్ గుగులోతు అవినాశ్ (25) అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ కొనసాగుతోంది. యువకుల అకాల మరణంతో బంగ్లా తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# శని దోష నివారణకు శ్రీశనేశ్వర స్వామికి తిలతైల అభిషేకాలు...






నాగర్ కర్నూల్/**ఆకాంక్ష జనవరి 24:** నాగర్ కర్నూల్ జిల్లా బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో వెలసిన శ్రీశనేశ్వర స్వామి ఆలయంలో మాఘమాసం శుక్ల షష్టి శనివారం సందర్భంగా భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ విశ్వవాసు సంవత్సరాన్ని పురస్కరించుకుని శని గ్రహ దోష నివారణార్థం స్వామివారికి భక్తులు తిలతైల అభిషేకాలు నిర్వహించి వైభవంగా పూజించారు.శనివారం శ్రీ సార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి ప్రత్యేకంగా తిలతైల అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ, మాఘమాసంలో శనేశ్వర స్వామిని దర్శించి పూజలు నిర్వహిస్తే భక్తులకు అత్యధిక ఫలితం లభిస్తుందని తెలిపారు. జన్మ రీత్యా, గోచార రీత్యా శనిగ్రహ దోషాలు నివారించుకోవాలంటే శక్తి మేరకు స్వామివారిని ఆరాధించాలని సూచించారు. పుష్యమి నక్షత్రం రోజులు, అష్టమి, నవమి, శని త్రయోదశి, అమావాస్య రోజుల్లో శనేశ్వర స్వామిని పూజించడం విశేష ఫలితాలను ఇస్తుందని తెలిపారు. స్వామివారికి నువ్వుల నూనె, నువ్వులుబెల్లం, జమ్మి ఆకు, నల్లని వస్త్రాలు, నీలిరంగు జిల్లేడు పూలతో పూజలు చేసి దానం చేస్తే స్వామివారి అనుగ్రహం లభిస్తుందని వివరించారు.అదేవిధంగా ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులు రుద్రాభిషేక పూజలు, అర్చనలు, దీపారాధనలు నిర్వహించారు. నందీశ్వర స్వామికి ప్రత్యేక అర్చన పూజలు చేశారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాల పంపిణీ జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, కమిటీ సభ్యులు కేంచే రాజేష్, ప్రభాకరాచారి, పుల్లయ్య, అడ్వకేట్ వీరశేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ అర్చకులు గవ్వమఠం శాంతికుమార్, ఉమామహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి వీరశైవ లింగాయత్

# లింగబలిజ సంఘ ప్రమాణ స్వీకారం నేడు....

నాగర్ కర్నూల్/**ఆకాంక్ష జనవరి 24:** రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమ్మేళనం మరియు నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నేడు (ఆదివారం) ఉదయం 10 గంటలకు హైదరాబాద్ సమీపంలోని కోకాపేటలో ఉన్న వీరశైవ లింగాయత్ బసవ భవన్ సంఘ కార్యాలయంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి నూతనంగా ఎంపికైన జిల్లా, మండల కమిటీ సభ్యులతో పాటు ఇటీవల ఎన్నికైన ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని నాగర్ కర్నూలు జిల్లా కార్యదర్శి కేంచే రాజేష్ కుమార్ తెలిపారు.2026 సంవత్సరానికి గాను ఎంపికైన జిల్లా కమిటీ, మండల కమిటీ సభ్యులు ఈ సందర్భంగా అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారని ఆయన వెల్లడించారు. అదేవిధంగా ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో నూతనంగా గెలుపొందిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనం ద్వారా సంఘ బలోపేతం, ఐక్యత, భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరగనున్నాయని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా లింగబలిజ, బలిజ కులస్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కేంచే రాజేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సంఘ అభివృద్ధికి ఈ సమ్మేళనం కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# యూరియా కోసం రైతుల రాత్రంతా నిరీక్షణ....

## చలిలో క్యూ లైన్లే దిక్కు...



నాగర్‌కర్నూల్ టౌన్/**ఆకాంక్ష జనవరి 24:** కాంగ్రెస్ పాలనలో యూరియా దొరకక రైతులు ప్రతినిత్యం నరకయాతన పడుతున్నారని నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం, రైతు వేదికల వద్ద శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజామున వరకు యూరియా బస్తాల కోసం రైతులు గంటల తరబడి నిరీక్షించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున రైతులు మండల కేంద్రానికి చేరుకుని, ఎముకలు కొరికే చలిలో స్వెటర్లు, దుప్పట్లు వేసుకుని క్యూ లైన్లలో పడిగాపులు కాశారు. కొందరు రైతులు నేలపై కూర్చుని రాత్రి గడపగా, మరికొందరు ఉదయం అవుతుందనే ఆశతో కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కనిపించారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందిస్తున్నామని గొప్పలు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. అధికార యంత్రాంగం ప్రతిరోజూ జిల్లాలో యూరియా విరివిగా ఉందని ప్రకటనలు చేస్తున్నా, వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉందని అంటున్నారు. రెండు మూడు బస్తాల యూరియా కోసం రోజులు తరబడి తిరగాల్సి వస్తోందని, చివరకు కార్యాలయాల వద్ద రాత్రులు గడపాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైన సమయంలో ఎరువులు అందకపోవడంతో పంటలపై తీవ్ర ప్రభావం పడుతోందని, సాగు పనులు ఆలస్యం అవుతున్నాయని రైతులు వాపోతున్నారు.యూరియా పంపిణీలో అనేక రకాల నిబంధనలు విధిస్తూ, పరిమిత బస్తాలే ఇస్తుండటంతో రైతుల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఆధార్, భూస్వామ్య ధ్రువీకరణలు, ఆన్‌లైన్ నమోదు వంటి కారణాలతో గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోందని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో యూరియా కోసం ఇలాంటి ఇబ్బందులు ఎదురు కాలేదని రైతులు గుర్తుచేస్తున్నారు. అప్పట్లో సమయానికి ఎరువులు అందేవని, ఇప్పుడు మాత్రం ప్రకటనలకే పరిమితమైందని విమర్శలు చేస్తున్నారు.క్షేత్రస్థాయిలో సరఫరా పెంచి, అవసరమైనంత యూరియా వెంటనే అందించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రాత్రి బవళ్ళు క్యూ లైన్లలో నిలబడి చలిలో అవస్థలు పడాల్సిన పరిస్థితి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, మండల కేంద్రాలతో పాటు గ్రామ స్థాయిలోనూ సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఉద్యమాలకు దిగక తప్పదని హెచ్చరిస్తున్నారు.

# రూ.10 వేల సుపారీతో స్కెచ్....

## అధికార పార్టీ అండతో సుపారీ రాజకీయం..?

## కమ్యూనిస్టు వార్డు మెంబర్‌పై హత్యాయత్నం

## వెనుక సర్పంచ్ పాత్ర...!



కొత్తగూడెం/**ఆకాంక్ష జనవరి 24:** అధికార పార్టీ అండదండలతో అహంకారాన్ని ప్రదర్శించిన ఓ సర్పంచ్, పొత్తు పార్టీలోని కమ్యూనిస్టు వార్డు సభ్యుడిపై సుపారీ ఇచ్చి మరీ హత్యాయత్నానికి పాల్పడ్డాడన్న ఆరోపణలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కలకలం రేపుతున్నాయి.పాలమ్మేందుకు వచ్చిన నాయకుడిపై సుపారీ గ్యాంగ్ దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం స్టేషన్ బేతంపూడి పరిధికి చెందిన కమ్యూనిస్టు పార్టీ వార్డు సభ్యుడు పోమియాపై అధికార పార్టీకి చెందిన సర్పంచ్ సుపారీ గ్యాంగ్ ద్వారా హత్యాయత్నానికి ఒడిగట్టినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ఈ నెల 12వ తేదీన పాల అమ్మేందుకు కొత్తగూడెం పట్టణానికి వచ్చిన పోమియా, నేతాజీ మార్కెట్‌లో వ్యాపారం చేస్తున్న సమయంలో కొందరు దుండగులు అకారణంగా గొడవ పెట్టుకుని విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన పోమియా వారి దాడి నుంచి తప్పించుకుని త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించాడు.పోమియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనాస్థలిలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఫుటేజ్ ఆధారంగా పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు కుట్ర వెలుగులోకి వచ్చింది. అధికార పార్టీకి చెందిన ఓ సర్పంచ్ రూ.10 వేలు సుపారీగా ఇచ్చి పోమియాను హతమార్చేందుకు స్కెచ్ వేశాడన్న విషయం పోలీసుల విచారణలో బయటపడినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ఈ ఘటన జరిగి ఇన్ని రోజులు గడుస్తున్నప్పటికీ కమ్యూనిస్టు పార్టీకి చెందిన ఒక్క నాయకుడు కూడా బహిరంగంగా స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, పొత్తు రాజకీయాల కారణంగానే ఈ వ్యవహారాన్ని బయటకు రాకుండా తొక్కి పెట్టారా అన్న అనుమానాలు ప్రజల్లో రేకెత్తుతున్నాయి. సదరు వార్డు సభ్యుడిపై సుపారీ ఇచ్చి దాడికి యత్నించిన అధికార పార్టీ సర్పంచ్‌పై కఠిన చర్యలు తీసుకుంటారా? లేక రాజకీయ ఒత్తిడుల మధ్య ఈ కేసు నీరుగారిపోతుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

# జనగామ జిల్లా రాజకీయ ఉద్రిక్తతలు....

## ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై కాంగ్రెస్ గుండాల దాడి..


## కేటీఆర్ తీవ్ర ఖండన...



జనగామ/ **ఆకాంక్ష జనవరి 24:** జనగామ పట్టణంలో జరిగిన ఘటన తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు మద్యం మత్తులో దాడికి యత్నించిన ఘటనను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. సాక్షాత్తూ మంత్రి సీతక్క సమక్షంలోనే పట్టపగలు కాంగ్రెస్ గుండాలు వీధి రౌడీల్లా వ్యవహరించడం రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంతగా దిగజారాయో చాటుతోందని ఆయన మండిపడ్డారు. ఒకవైపు ముఖ్యమంత్రి అధికార మత్తులో విదేశాల్లో జల్సాలు చేస్తుంటే, మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ గుండాలు మద్యం మత్తులో విర్రవీగుతూ విధ్వంసానికి పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. అధికారికంగా జరిగే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల వద్ద కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు పెట్టాల్సిన దుస్థితి తెలంగాణలో నెలకొందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రే నేరాలను పెంచి పోషించేలా ప్రకటనలు చేస్తున్న నేపథ్యంలోనే క్షేత్రస్థాయిలో లా అండ్ ఆర్డర్‌ను దెబ్బతీసే సంఘటనలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీతో పాటు తెలంగాణ సమాజం కూడా ఈ గడ్డపై ఫ్యాక్షన్ సంస్కృతిని ఎట్టి పరిస్థితుల్లో సహించదని స్పష్టం చేశారు. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పారని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ అధికార పార్టీ అరాచకాలకు సరైన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.జనగామ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కోసం మంత్రి సీతక్క పర్యటన సందర్భంగా ఈ ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి మద్యం మత్తులో ఉన్న అనుచరగణంతో కలిసి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై దాడికి యత్నించారు. 'ఎమ్మెల్యే గో బ్యాక్' అంటూ నినాదాలు చేస్తూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై దూషణలకు దిగారు.దీంతో అప్రమత్తమైన బీఆర్ఎస్ శ్రేణులు భారీగా అక్కడికి చేరుకుని ప్రతినినాదాలతో కౌంటర్ ఇచ్చారు. ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మద్యం మత్తులో ఎమ్మెల్యేపై దాడికి యత్నించిన కాంగ్రెస్ నాయకుడిని పోలీసులు పక్కకు తీసుకెళ్లినా, అతడు తిరిగి తోసుకుంటూ పెనుగులాటకు దిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.మంత్రి సీతక్క పర్యటన అంతటా కొమ్మూరి వర్గం నాయకులు, వారి అనుచరగణం కావాలని గొడవలకు దిగారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. అభివృద్ధి కార్యక్రమాలను రసాభాస చేసుకోవద్దని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన పార్టీ శ్రేణులను పలుమార్లు సముదాయించినప్పటికీ, కాంగ్రెస్ నాయకులు దూషణల పర్వాన్ని కొనసాగించారని పేర్కొన్నారు. ప్రొటోకాల్‌కు విరుద్ధంగా మాజీ ఎమ్మెల్యే కుమారుడు, అతడి అనుచరగణం అడ్డుపడటమేంటని ఎమ్మెల్యే పోలీసులను ప్రశ్నించగా, సీఐ సత్యనారాయణరెడ్డి కాంగ్రెస్ నాయకులను అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరినట్లు సమాచారం. ఈ మొత్తం ఘటనపై మంత్రి సీతక్క కూడా అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.ఈ ఘటనతో జనగామ జిల్లాలో రాజకీయ వాతావరణం మరింత ఉద్రిక్తంగా మారింది. శాంతిభద్రతల పరిరక్షణపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# హంగూ ఆర్భాటాలకు దూరంగా ఆదర్శ వివాహం...

## రిజిస్ట్రార్ కార్యాలయంలో ఐఏఎస్ ఐపీఎస్ దంపతుల సాదా పెళ్లి...



ఉత్తరప్రదేశ్/**ఆకాంక్ష జనవరి 24:** ప్రస్తుత సమాజంలో పెళ్లిళ్లు అంటే పోటీగా మారిపోయిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకరికి మించి ఒకరు తమ స్తోమతకు మించి లక్షల నుంచి కోట్లు ఖర్చు చేస్తూ వివాహాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. డీజేలు, ఆర్కెస్ట్రాలు, డాన్సర్లు, విలాసవంతమైన వంటకాలు, ప్రత్యేక ఆహ్వాన పత్రికలు అంటూ పెళ్లి వేడుకలు ఆడంబరానికి అద్దం పడుతున్నాయి. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో ఓ వ్యాపారి తన కూతురు పెళ్లికి మూడు కిలోల వెండితో లగ్నపత్రిక తయారు చేసి బంధువులకు పంపిన ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీనికే కోటి రూపాయలకు పైగా ఖర్చయిందని సమాచారం. ఇక పెళ్లి వేడుకలు ఏ స్థాయిలో జరిగాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నత స్థాయిలో ఉండి కూడా ఆడంబరాలకు దూరంగా, సాదాసీదాగా వివాహం చేసుకున్న ఓ ఐఏఎస్ ఐపీఎస్ జంట ఇప్పుడు అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లింగారెడ్డి గూడెంకు చెందిన యువ ఐపీఎస్ అధికారి శేషాద్రిని రెడ్డి, కడప జిల్లా చెందిన ఐఏఎస్ అధికారి శ్రీకాంత్ రెడ్డి ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా వివాహం చేసుకున్నారు.చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొద్ది మంది కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం జరిగింది. భారీ వేదికలు, శోభాయమానమైన అలంకరణలు, ఖరీదైన విందులు లేకుండానే చట్టబద్ధంగా వివాహాన్ని నమోదు చేసుకొని దాంపత్య జీవితంలోకి అడుగుపెట్టారు. ఉన్నత హోదాల్లో ఉన్నప్పటికీ సామాన్యుల్లా సాదా విధానంలో పెళ్లి చేసుకోవడం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ప్రస్తుతం ఐపీఎస్ శేషాద్రిని రెడ్డి కుత్బుల్లాపూర్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీకాంత్ రెడ్డి ఐఏఎస్ శిక్షణలో ఉన్నారు. వీరి వివాహానికి పలువురు ఉన్నతాధికారులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వచ్చిన బంధువులు తలంబ్రాలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆడంబరాలకే ప్రాధాన్యం ఇస్తున్న నేటి సమాజంలో, సాదాసీదా వివాహం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకున్న ఈ ఐఏఎస్ ఐపీఎస్ దంపతులు యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహణ....

## బాలికల హక్కులు, విద్యపై అవగాహన...



నాగర్ కర్నూల్ /**ఆకాంక్ష జనవరి 24:** రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ గారి ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ నాగర్ కర్నూల్ సెక్రటరీ శ్రీమతి ఏ. శ్రీదేవి హాజరై మాట్లాడారు. ప్రతి సంవత్సరం జనవరి 24వ తేదీన జాతీయ బాలికల దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. సమాజంలో బాలికల పట్ల ఉన్న లింగ వివక్షను తొలగించడం, బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం, భద్రతపై అవగాహన కల్పించడమే ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.బాలిక శిశువులను రక్షించడం, బాలికలను శక్తివంతులుగా తీర్చిదిద్దడం ద్వారా దేశ అభివృద్ధికి బాటలు వేయవచ్చని అన్నారు. సమాజంలో బాలికల పట్ల ఎలాంటి లింగ వివక్ష చూపకుండా వారిని బాలురతో సమానంగా చూడాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలో బాలికలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, ప్రతి విద్యార్థిని ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థి దశ అనేది జీవితంలో అత్యంత కీలకమైన దశ అని, ఈ దశలో సరైన మార్గంలో నడిచితే భవిష్యత్తు బంగారంగా మారుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీమతి జి. భవానీ బాయి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.తదనంతరం నాగర్ కర్నూల్ పట్టణంలోని సబ్ జైలును జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శ్రీమతి ఏ. శ్రీదేవి సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి వారికి కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేని ఖైదీలకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ తరఫున ప్రభుత్వ న్యాయవాదిని నియమిస్తామని భరోసా ఇచ్చారు. జైలు పరిసరాలు, వంటగదిని పరిశీలించి పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జైలు సూపరింటెండెంట్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ గుణశేఖర నాయుడు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ భవానీ బాయి పాల్గొన్నారు.

